UNIVERSAL LIBRARY
OU_204616
UNIVERSAL LIBRARY

# నిరుద్ధభారతము

## ( అస్పృశ్యతాఖండనము )

మంగిపూడి వేంకటశర్మచే

రచియింపబడినది

మూడవకూర్పు

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

# హెచ్చరిక

ఉ. పంచములార! యంతరిత భవ్యగుణోత్కరులార! గర్భితో
దంచిత శక్తులార! యసమర్థులె మీరలు! గొఱ్ఱెమందలో
వంచితమై చరించు నల వ్యాఘ్ర కిశోరము రీతిఁ బూర్తిగా
వంచితులైతి రాత్మబల వైఖరి నెంచుఁడు! మేల్కొనుం డిఁకన్.



మహాత్మ గాంధి

# పరిచయవాక్యము

మానవులందు ప్రపంచవ్యవహారములయందు ప్రకృతిసిద్ధములయిన భేదములు గుణకర్మవిభాగాదుల వలనను గలుగుచున్నవి. గుణకర్మవిభాగములు దేశకాలపాత్రాధారములు. దేశకాలపాత్రాధారములును, గుణకర్మసంజాతములును నైన జాతిమతాదిభేదములును, వర్ణాశ్రమభేదములును ననిత్యములును, సాపేక్షములును గాని శాశ్వతములును, నిరపేక్షములును గావు. ప్రవృత్తివలనను గలిగిన భేదముల నతిక్రమించి యాత్మోన్నతిని బడయుటకు సకల మానవులును సమానాధికారులు. సమానాధికారులైన తోడిమానవులను ధర్మబాహ్యులను జేయుట కేవలము దైవధర్మబహిష్కరణము. జన్మవలనను గలిగిన పరిస్థితులను నతిక్రమించి పురుషార్థమును బడయుటకు సకలజనులును నధికారులను పరమార్థమును హిందూమతేతిహాసములు వేనోళ్లను బోధించుచున్నవి.

వేదములు, వేదాంగములు, ధర్మశాస్త్రములు, పురాణకావ్యేతిహాసాదులు సత్యాన్వేషకులకీపరమార్థమును పరిస్ఫుటము చేయుచున్నవి. హిందూమతపరిణామ

మునందు కర్మమార్గము, జ్ఞానమార్గము, భక్తిమార్గము సర్వసమత్వసర్వాత్మత్వపర మైన పూర్ణయోగమునందు పరిపక్వమును బొందినవి. అద్వితీయమును, నఖండమును నైన పూర్ణయోగార్థమును ప్రస్థానత్రయాదిమతగ్రంథ ములు బోధించుచున్నవి. ప్రవృత్తియందు జీవ మనవరత మభివృద్ధి నొందుచున్నవిధమును ననంతమైన జీవచరి త్రము సువ్యక్తము చేయుచున్నది. జీవుడు జననము సంక్రమింపజేసిన ధర్మసంస్కారమునకు కర్త యైనటులు హర్తయును. అవ్యయ మైన ఆత్మ, సాపేక్షము లైన వర్ణాశ్రమాదిసంస్కారముల నతిక్రమించి, నిరపేక్ష మైన మోక్షమును బడయుచున్నది. అట్టి యాత్మోపలబ్ధికి సకలజనులును, జాతిమతకులాదిభేదములు లేక, సమా నాధికారులు. హిందూమతపరమార్థ మైన 'తత్త్వ మసి' 'సర్వం ఖ ల్విదం బ్రహ్మ' త్యాదిమహావాక్యా ర్థములను విస్మరించి జడప్రాయమైన ఆచారధర్మారాధన పరాయణమైన మతమునందు హిందూమతపరమార్థ మును గ్రహించుట సకలజనులకును పరమధర్మము. ప్రవృత్తియందు సంచలనము జీవధర్మము; నిశ్చేష్టత విలయమరణచిహ్నము.

శ్లో. చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్ గుణకర్మ విభాగశః,
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్.—భగ.

మనుజులు, గుణకర్మవిభాగాదులు కల్పించెడి స్థితిగతులకరణమునకువలె నకరణమునకును,ధర్మాధికారులు. మనుజులకు కరణాకరణసామర్థ్యము లేనపుడు పురుషార్థసిద్ధియే దుష్ప్రాప్య మగుచున్నది. నిరుద్ధభారతము మానవధర్మపరమైన హిందూమత పరమార్థమును తేటతెనుగున పద్యరూపమునను హృద్యముగను బోధించుచున్నది.

గాంధిమహాత్ముని యుపదేశాదేశములు ప్రజాలక్ష్యమును హరిజనసమస్యయందు లగ్నము చేసినవి. మహాత్ముని ధర్మదీక్ష అవర్ణులందును సవర్ణులందువలెను మహాసంచలనమును గలుగజేసినది. హిందూస్థానమునందంతటను హరిజనోద్ధరణమునకు ప్రచండమైన ప్రయత్నములు జరుగుచున్నవి. ఇతర రాష్ట్రములందువలెను ఆంధ్ర రాష్ట్రమునందును హరిజనోద్ధరణమునకై ప్రబలప్రయత్నములు జరుగుచున్నవి. ఆంధ్రక్షేత్రమునందు హరిజనోద్యమాంకురము లిదివరకె తలయెత్తి వర్ధిల్లుచున్నవి.

సంస్కరణప్రియులైన శ్రీమంతులు, పండితులు, గ్రంథకర్తలు,కవులు,భక్తులు, మతాభిమానులు హరిజనోద్ధరణమునకు వారి విద్యావివేకసంపదలను వినియోగించినవిధమును ఆంధ్రదేశేతిహాసములు విశదము చేయు

చున్నవి. సంస్కరణోద్యమమునకు శ్రీయుత వీరేశ లింగము పంతులుగారు పితామహులు; రఘుపతి వేంకట రత్నమునాయుడుగారు గురువులు; శ్రీ పిఠాపురము మహారాజాగారు రాజపోషకులు; చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు, మంగిపూడి వేంకటశర్మగారు మొదలగు కావ్యకర్తలు మంగళాశీర్వాదకులు; గూడూరు రామచంద్రుడు, వేమూరి రాంజీరావు, నల్లపాటి హనుమంత రావు, దిగుమర్తి హనుమంతరావు, తల్లాప్రగడ ప్రకాశ రావు, నరసింహశర్మ, వెల్లంకి కృష్ణమూర్తిగారులు మొదలగువారు హరిజనసేవకులు. శ్రీయుత రాయుడు గంగయ్య, కమతము షణ్ముఖము, నరాలశెట్టి దేవేంద్రుడు, సుంద్రు వెంకయ్య, భాగ్యవర్మ రెడ్డి, సాకేటి గురువులుగారు మొదలగు హరిజననాయకులును స్వసంఘాభ్యుదయమునకు పాటుపడుచున్నారు.

ఆంధ్రావనియందు హరిజనోద్యమ వ్యాపనమునందు శ్రీయుత మంగిపూడి వేంకటశర్మగారి కృతి "నిరుద్ధభారతము" హరిజనసమస్యయందు పండితపామర హృదయమును లగ్నము చేసినవిధమునకు గ్రంథమునకు గలిగిన గౌరవవ్యాపకములు ప్రమాణములు.

నిరుద్ధభారతము :—భారతీయులందు హరిజనులత్యంతము నిరుద్ధులు. భారతధర్మరక్షణమునకు నిరుద్ధు

లనిరుద్ధులు గావలసినయవసరమును దేశకాలపరిస్థితులు సువ్యక్తము చేయుచున్నవి. అగ్రజధర్మపరాయణమైన భారతధర్మము దేశమునకును ధర్మమునకును దేవునకును ననర్థదాయకమును, అన్యాయమును, నవమానకరమును. వేంకటశర్మగారు నిరుద్ధభారతమునందు హరిజనులపరివేదనమును, సవర్ణుల యపరాధములను, నుభయుల ధర్మనిర్వాహణమార్గమును రసవంతముగ వర్ణించిన పద్యావళి రసానందమును గలుగజేయుచున్నది. శర్మగారిశీలమువలెను కావ్యశైలియును, మృదువుగను, సరళముగను, సరసముగను నున్నది. ప్రతిపద్యమును భావగర్భితమైన దైన్యదృశ్యమొ, భక్తిదృశ్యమొ, కరుణాదృశ్యమొ, మహత్త్వదృశ్యమొ, సాంగోపాంగముగ చిత్రించినటులు కల్పింపబడి భావప్రపంచమునందు సంభ్రమమును గలుగజేయుచున్నది.

సవర్ణులకు ప్రార్థనము సౌమ్యముగను, భావగర్భితముగను నున్నది.

ఉ. మాలల గోల భాగవతమా, మరి భారతమా, వినంగ ; మా
కాలము వోవుచే ఫలము కానికిక పుణ్యమ! పూరుషార్థమా ;
"మాల లటంచుఁ బేరొకనిన మాత్రనె పాపమువచ్చు"నంచుఁ బ్రా
ల్మాలక, మీర లీబయిసిమాలిన దీమల ఖాలకింపుడీ!

ఉ. వేదవిభాగముల్ జరిపె విశ్వము సర్వముఁ బ్రస్తుతింప ; న
ష్టాదశసత్పురాణములు శస్తమతిన్ విరచించె ; సర్వలో
కాదరణీయమైన యితిహాసము భారతమున్ రచించె ; న
బ్జోదరు వంశసంభవము నొందెను వ్యాసుఁడు నిమ్నజాతుఁడే.

మ. నరజన్మం బిది యుత్తమం బనుచు నానాదేశవిద్వాంసులున్
వరుసన్ రూఢి యొనర్చినట్టిపలుకుల్ వ్యర్థంబుఁ గావించి యి
ట్లరరే! మడ్డిమృగాలు మానవులు వియ్యం బందుచున్నారు; భూ
సురులారా! దయఁజూచి పుల్కసులకున్ శుద్ధత్వమున్ నేర్పరే!

చ. మనువున కప్రతిష్ఠ, ఋషిమండలికెల్లను నల్లచుక్క, చ
క్కని మన వేదశాస్త్రముల ఖ్యాతికిఁ దెచ్చిన మచ్చ, ధర్మపున్
ఖునులయి వన్నెఁ గన్న మతకర్తలకీర్తికళాకళంక మీ
యనుచితవృత్తిఁ బోవిడిచి యార్యు లఖండయశంబు నొందరే.

సీ. నుడువలేదు సుమండి! కడజాతివారింట
భోజనంబులు సేయఁ బోలు ననుచు
పలుకలేదు సుమండి! పంచమజాతితో
స్నేహంబు లేప్రొద్దు సేయుఁ డనుచు
చెప్పలేదు సుమండి! చేరి మాలలతోడఁ
బొందుగా వియ్యంబు లందుఁ డనుచు
ఆడలేదు సుమండి! యంత్యవర్ణజులకు
వింగువేడ్కలకు రావింపుఁ డనుచు

తే. ఆర్యవరులార ! సహభోజనాదికములు
సహజసద్భావసంపద సమము గావు !
ఐకమత్యంబు సమకూర్చి యలరఁజేయు
సానుభూతియె యన్నింటిసరి సుమండి!

సీ. మోయకున్నదె మిమ్ము మోయునట్టులు మమ్ము
 భూమక్షమకు దీవి భూమిదేవి
మీకు వెన్నెలఁ గాచి మాకుఁ గాయుటలేదె!
 చలువలపరసీమ చందమామ
మీమీఁదనే కాని మామీఁద వీవఁడే
 సరససౌరభశాలి చల్లగాలి
వెలుఁగు వేఁడియు మీకుఁ గలిగించి మాకీఁడె
 భవ్యసౌఖ్యకరుండు భాస్కరుండు
తే. కురిసి మీపైని మాపైనిఁ గురియకున్నె
సకలసస్యావనసుకీర్తి జలదమూర్తి
దైవదృష్టికిఁ బక్షపాతంబు లేదు;
సృష్టి నీక్షించి తెలియరే! శిష్టులార!

అవర్ణులకుఁ జేసిన హెచ్చరికయును సంబోధనమును నాత్మవిశ్వాసమునకు సాధనముగ నున్నది.

ఉ. పంచములార! యంతరిత భవ్యగుణోత్కరులార! గర్భితో
దంచిత శక్తులార యసమర్థులె! మీరలు! గొఱ్ఱెమందలో
వంచితమై చరించు నల వ్యాఘ్రకిశోరము రీతిఁ బూర్తిగా
వంచితులైతి రాత్మబల వైఖరి నెంచుఁడు! మేల్గొనుం డిఁకన్.

సీ. శుచి లేదనుచు మమ్ముఁ జూడరా దందురా
 పరిశుభ్రతను మాకుఁ గఱపరాదె!
పరమమూర్ఖులు మీరు పనికిరా రందురా
 తెలివితేటలు మాకుఁ దెలుపరాదె
సద్గుణంబుల మీరు సాటిరా రందురా
 సుహితబుద్ధులు మాకుఁ జెప్పరాదె

కరము నీచులు మీరు కలయరా దందురా
నెఱతనంబును మాకు నేర్పరాదె!
తే. అతిదరిద్రు లగుట రోతు మందు రేని
సిరి గలుగు మార్గములు మాకుఁ జెప్పరాదె!
భూతదయ యుంచి, పటు సానుభూతి మించి
శ్రేయములు గూర్పరయ్య! దేశీయులార!

సీ. త్రాగుబోతు లటంచు దప్పించఁబోదురా
మద్యపాయు లిఁకెంతమంది లేరు!
గొడ్డుమాంసము దినే మడ్డివా రందురా
మాంసభక్షకు లెంతమంది లేరు!
నీమంబు లెఱుఁగని నీచుల మందురా
మావంటివా రెంతమంది లేరు!
నిత్యసేవకు లంచు నిరసింతు మందురా
మందభాగ్యు లిఁకెంతమంది లేరు!
తే. ఉచితరీతిని భాషించు నొప్పిదంబు
లేనివా రని మన్నింపరేని, యితర
మనుజులం దట్టివా రెంతమంది లేరు!
మమ్ము జాలకొనజేయ మూలమ్ము గలదె!

సీ. మము మీరు వెలివేసి మన్నింప కుంటచే
నూరిబైటను మేము చేరవలసె
పరిశుద్ధతను మాకుఁ గఱపకుండుటచేత
మాలిన్యమున మున్గి తేలవలసె
చదువు చెప్పక మమ్ము వదలివేయుటవల్ల
నజ్ఞానకూపమం దణఁగవలసె

నీతు లేమియు మాకు నేర్పకుండుటచేత
దుర్నీతిలోఁ బడి దొర్లవలసె
తే. మన మతంబునఁ గల ధర్మ మర్మములను
జెప్పనికతాన నన్యులఁ జేరవలసె
కలసి చేఁదోడు వాఁదోడుగా మెలంగు
మ మ్మిటు లుపేక్షసేయ నేమమ్ముగలదె!

సీ. మాకు మీరు మతంబు మప్పకుండినను మీ
మతమె మా మత మంచు మదిని దలఁచి
వెలివేసి మీ రెంత వెలువరించుచు నున్న
నశ్రాంతమును మిమ్మె యనుసరించి
అదయులై మ మ్మెంత యణఁగఁద్రొక్కుచు నున్న
నుద్ధరించెద రంచు బుద్ధి నమ్మి
చదువీక దుస్సహాజ్ఞానాంధువందు ద్రో
సినను మాగురు లంచు సేవచేసి
తే. మేము మిము వీడకున్నాము మేకలట్లు
కటికితనమున మ మ్మిట్లు గాసిబెట్ట
తగవుగా, దింక మాకు విద్యల నొసంగి
దయ యొసంగఁ బ్రోవరే దాతలార!

సీ. కాపురంబులు చేయఁగాఁ జొట్టుగుడిసెలే
కాని లోగిళ్లు లెక్కకును లేవు
చెలఁగి కట్టంగ మాసిన చింపిగుడ్డలే
కాని వల్వలు కొంచమైన లేవు
త్రావంగ నూకల జావయు, గంజియే
కాని యన్నముఖ శాకములు లేవు

సొగసుగాఁ దాల్ప గాజులుఁ, బూసపేరులే
కాని బంగరునగల్ లేనె లేవు

తే. పంట పండింపఁగా నూరివారిచెలె
కాని సొంతంబు లెందును గానరావు
అకట! మా ఘోర దారిద్ర్య మొకరికైన
జాలి పుట్టింపదాయెనా? శ్రీలుఁగార!

దిగంతవిశ్రాంతమైన ధర్మఘోష వ్యాసయుగము నందువలెను గాంధినవయుగమునందును బధిరశంఖారావముగ నున్నది. సనాతనులును సంస్కరణప్రియులును హిందూమహాధర్మబోధను నీకృతియందు దెలిపినటులు ప్రశాంతచిత్తులై యవధరించి కర్మయోగారూఢు లగుదురుగాత!

శా. బందా లెల్ల సడల్చివేసుకొని సద్భావంబు నౌదార్య మిం
పొందన్ సర్వసమత్వ మాచరణచే బోధించి సర్వప్రజా
బృందాలన్ వడిలో నిముడ్చుకొనుచున్ ప్రేమించుచున్ గందులన్
నిందల్ లేక వెలింగి సాటిమతముల్ నిన్మెచ్చి మన్నింపఁగా
హిందూదేశము నుద్ధరింపఁగదవే! హిందూమహాధర్మమా!

సీ. ఆబుద్ధదేవుఁ డీ ట్లవతరించె నటంచు
బౌద్ధసంఘము సదా ప్రణుతిసేయ
జినుఁడె యీరూపున జనియించె నిజ మంచు
జైనసంఘము లెల్ల సన్నుతింప
ఆయేసునాథుఁ డీట్లవతార మెత్తినాఁ
డనుచు క్రైస్తవసంఘ మభినుతింప

ఆదినారాయణునంశచే నుదయించె
నవు నంచు సకలహిందువులుఁ గొలువ

తే. అఖిలదేశాలవారు మహాత్ముఁడనఁగ
నఖిలధర్మస్వరూపుఁ డై యడరుగాంధి
తగవుఁ దప్పఁ డధర్మంబుదారిఁ జొరఁడు
కినియ కాతనిహితబోధ వినుఁడు! మనుఁడు!

ఉ. ఆరయ హిందుదేశమున నైదవభాగము నిమ్నజాతు లు
న్నారు గదా! నిరంతరము నైచ్యపుభావముతోడఁ జూచినన్
వారలు వైర మూని మనపైని; మతాంతరులై, ద్విధాత్వ మే
పారఁ జరించినన్ మరల భారతవర్షము వృద్ధిఁ జెందునే!

సీ. మాల మాదిగలును మనవంటిమనుజులే!
వారిప్రాణము మనప్రాణ మొకటె!
సర్వావయవములు సర్వేంద్రియములును
సర్వమానవులకు సమముగాదె!
నీర మాహారము నిద్రయు మనకుమ
వారికిఁ గూడ నావశ్యకములె!
వారల దేహంబువలె మన దేహంబు
రక్త మాంసాదుల రాశి యగును!

తే. మోదఖేదాలు, సుఖదుఃఖములను, మరియుఁ
బుణ్యపాపాలుఁ, గలిమిలేములును సరులె!
ఉభయులకు హెచ్చులొచ్చు లే మున్న వింక?
మనసు మార్ఖ్యంబు నెనసి క్రమ్మఁబడుగాక!

మ. మనదేశంబున జన్మమెత్తి మనక్షేమంబున్ సదా కోరి త
మనయంబున్ మన సంఘవృద్ధికయి దాస్యం బొప్పఁగాఁ జేయుచున్
మనదైవంబులఁ గొల్చుచున్ మన మతామ్నాయప్రకారంబుగా
మనుచున్నన్ మనదేశసోదరులె యన్మాటన్ విచారింపమే!

నిరుద్ధభారతమునకు రెండుకూర్పులు ముగిసినవి. అందలి రసవంతములైన పద్యము లాంధ్రావనియం దంతటను వ్యాపకమును గాంచినవి. పట్టణములందును పల్లెలందును, సభలయందును సమాజములందును, నిందలిపద్యములను ప్రాచీనపద్యములనువలెను చదువుట పరిపాటి యైనది. ఈ విఖ్యాతగ్రంథమునకు మూడవకూర్పునకు, ఆంధ్రలోకమునకు చిరపరిచితమైన గ్రంథమునకును, చిరపరిచితుడైన గ్రంథకర్తకును పరిచయవాక్యములను వ్రాయుట యసమంజసము. శ్రీయుత వేంకటశర్మగారిమీదను, నిరుద్ధభారతముమీదను, విషయముమీదను గల గౌరవాదరణములు నన్నీచర్వితచర్వణమునకు పురికొలిపినవి.

ఆంధ్రలోకము, సుపరిచితమైన నిరుద్ధభారతమున కాదరస్వాగతంబుల నొసంగుగాత, భగవదనుగ్రహము నను నాంధ్రాభ్యుదయమును,మానవధర్మాభ్యుదయమును కూడుగాత !

శ్రీముఖ సం. ఆషాఢ శు. సప్తమి
శుక్రవారము.

కా. నాగేశ్వరరావు.

# నిరుద్ధభారతము

ఉ. వేదమతంబె హిందుమత విశ్రుతిఁగాంచె ననంగ దీనికిన్
వేదములే ప్రమాణమని వేరె వచింపఁగనేల? బ్రాహ్మణో౽
స్యాదిశ్రుతి ప్రమాణములు జాతులు నాలుగెయంచుఁ జెప్పఁగా
నైదవజాతి యెక్కడిదో? యార్యమహాజనులార, చెప్పరే! ౧

ఉ. భారతవర్షమందు ఘనపండితుఁడై స్మృతికర్తృ మండలిన్
పేరు వహించినట్టి మనువే ద్విజ, బాహుజ, వైశ్య, శూద్రులన్
వారల జాతులే కలవు "నాస్తి తు పంచమ" యంచు మున్ని
ర్ధారణ చేసి చెప్పెను గదా! మరి దీని కిఁ కేల తర్కముల్? ౨

ఉ. గీతను బోధ సేయునెడఁ గ్రీడికిఁ గృష్ణుఁడు చెప్పలేదె! నా
చేతనె నాల్గు జాతులు సృజింపఁబడెన్ గుణకర్మ భేదతా
హేతువుచేత నంచు; మన కెల్లను గీత ప్రమాణమే గదా!
బాతిగఁ జెప్పరయ్య! యిఁకఁ పంచమ జాతి యదెట్లు వచ్చెనో? 3

తే. మనువు మొదలైన పండిత మాన్యులెల్ల
వర్ణములు నాలు గనుచును వానిలోని
సంకర కులంబె పంచమ జాతి యనుచు
నిర్ణయింపరె? సంకరుల్ నేఁడు లేరె? ౪

---

(౨) శ్లో. బ్రాహ్మణః క్షత్రియో వైశ్యస్త్రియోవర్ణా ద్విజాతయః;
చతుర్థ ఏకజాతిస్తు శూద్రో నాస్తితు పంచమః.
మనుస్మృతి దశమాధ్యాయము.

(3) శ్లో. చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః. భగవద్గీత.

తే. మాల లని, పంచము లటంచు, మాదిగ లని,
శ్వపచు లని, చెప్పఁగా రాని వా రటంచు,
మరియుఁ జండాలు రని తోడిమానవులను
దరలివేయుట సాంఘిక ధర్మమగునె ? ౫

క. శైలంబుల నివసించెడు
మాలరు లను నీచజాతి మనుజులె యిపుడీ
మాల లనఁ బడెడు వా రని
చాలఁగఁ జెప్పుదురు గాదె చారిత్రవిదుల్ ? ౬

క. అల్ల మతంగ మహాముని
తల్లజు సంతానమేగదా మాతంగుల్ !

---

(౬) కొండలలో నివసించు మాలర్ అను అనార్యజాతివారే మాల లని ఆంధ్రదేశ చరిత్రకర్తలగు శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు చెప్పుచున్నారు.

(౭) మతంగ మహాముని సంతతియే మాతంగులనుటకు-"మతంగాజ్జాతాః మాతంగాః" అని లింగాభట్టీయము. మరియు "చడీ కోపే" కోపము గలవారు చండాలురనియును లింగాభట్టీయమే చెప్పుచున్నది. మతంగమహాముని కోపిష్ఠియనుటకు నిదర్శనముగా శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిలుగారు మానవసేవయం దిట్లు వ్రాయుచున్నారు: "మతంగుఁడు బ్రాహ్మణస్త్రీకిని మంగలివానికినిఁ బుట్టిన సంకరార్యుఁడు. బ్రాహ్మణునకును శూద్రునకును బుట్టినవానినిఁ జండాలుఁడని స్మృతులు చెప్పుచున్నవి. "శ్లో. శూద్రాదాయోగవః క్షత్తా చండాల శ్చాధమోనృణాం, వైశ్య రాజన్య విప్రాసు జాయంతే వర్ణ సంకరాః" (మనుస్మృతి, దశమాధ్యాయము) అనఁగా శూద్రునివలన వైశ్యస్త్రీకి జనించినవాఁడు ఆయోగవుఁడనియు, క్షత్రియస్త్రీకిజనించినవాఁడు క్షత్తయనియు, బ్రాహ్మణస్త్రీకిఁ గలిగినవాఁడు చండాలుఁడనియు,వీరు వర్ణసంకరులనియు నర్థము. అందువలననే మతంగుఁడును జండాలుఁడుగా లెక్కింపఁబడెను. మతంగుఁడు తాను వర్ణబాహ్యుఁడనని తెలిసికొని తపస్సుచే

తెల్లమగు తెలుఁగు నుడి సం
పల్లాలసులార! వారె మాదిగలు సుఁడీ! ౭

---

దానిని మాన్పుకొన గొప్పప్రయత్నము జేసియు వ్యర్థమనోరథుఁడై యార్యావర్తమును వదలి దక్షిణాపథమును బ్రవేశించెను. మతంగుని గురించి విస్తారముగాఁ దెలిసికొనఁగోరువారు మహాభారతము అనుశాసనిక పర్వములోని యింద్రమతంగ సంవాదమును జూతురుగాక! ఇతఁడు దక్షిణాపథమును బ్రవేశించిన మార్గము పారియాత్ర పర్వతము ననుసరించి నర్మదను దాఁటి వచ్చెనని తెలియుచున్నది. ఆర్యావర్తనమునందు బ్రాహ్మణులతో సరిపడక నర్మదాతీరమునకు వచ్చెను. అచ్చట నపుడు గంధర్వులనుజాతివా రుండిరి. వారినాయకుఁడు ప్రియదర్శనుఁడు. వానికుమారుఁడు ప్రియంవదుఁడు. ప్రియంవదునితో మన మతంగునికి సరిపడక యాతనికి శాపమిచ్చి దక్షిణమునకుఁ దరలెను. ప్రియంవద మతంగుల వృత్తాంతము రఘువంశము ౫-వ సర్గలోఁ గనుఁగొనవచ్చును పిమ్మట మతంగుఁడు వాలి సుగ్రీవాద్యనార్య నివాసమగు ఋశ్యమూకమును జేరెను. అచ్చట మతంగునకు యోజనాయతమైన స్థలమలవడెను. అచ్చటఁ గొంతకాల ముండినపిమ్మట నా ప్రదేశాధికారియగు వాలికిని మతంగునకును విరోధము సంభవించెను. ఈవృత్తాంతమును వాల్మీకి రామాయణము కిష్కింధాకాండ ౧౧ వ సర్గలో చూడవచ్చును...మొదట శూద్రునకును బ్రాహ్మణస్త్రీకిని జన్మించి వర్ణబాహ్యుఁడుగాఁ బరిగణింపఁబడి యింద్రునంతవాని మాటనుగూడఁ దిరస్కరించి పిమ్మట గంధర్వులతోఁ జేరియు వారితోడను గ్రుద్దులాడి తరువాత నార్యావర్తజనితులగు వాలి సుగ్రీవాదులను జేరియు వీరితోడను బోరాడిన మతంగునికి మనయార్యులు తలుచు కోపము గలవాఁడు గానఁ జండాలుఁడనియు, నేవర్ణమునకుఁ జెందనివాఁడు గాన వర్ణబాహ్యుఁడనియు, నే గ్రామమునకుఁ జేరనివాఁడు గాన నంతేవాసి యనియుఁ బేర్లిడిరి. మఱియు, మతంగుఁడు బ్రాహ్మణికి క్షౌరకునివల్లఁ బుట్టినవాఁడై చండాలుఁడయ్యెను. పిమ్మట మహాతపస్వియై చండదేవుఁ డనిపించుకొనెను.

రతము, అనుశాసనికపర్వము.

తే. ఆల మతంగుఁడు ముక్కోపి యగుటఁ గతనఁ
గోపి చండాలుఁడనఁ బరగుట కతాన
నతఁడు చండాలుఁడయ్యె; సంతతికిఁగూడ
వరుసఁ జండాలురను పేరు వాడుకయ్యె. ౮

క. ఏవపడక నీచమనక
వావిరి శునకములఁ దినుచు శ్వపచులయిరి; అం
తేవాసులైరి పురముల
కావల వసియించుచుండునట్టి కతమునన్. ౯

తే. పరమ ఛాందసులైనట్టి బ్రహ్మకులులు
నియమవేళల వీరి పేరయినఁ గాని
చెప్పరాదన్న కతమునఁ జెప్పరాని
వారనుచుఁ బంచములకెల్లఁ బేరు కలిగె. ౧౦

ఉ. మానవులందు జాతిపరమావధు లున్నవి వాని తత్త్వముల్
గానక సంచరించిన వకావకలై చెడు జాతియెల్ల నీ
మానవధర్మమైన పరమార్థ మెఱింగినవారు కావునన్
ధీనిధులై వెలుంగు మనదేశపుఁబెద్దలు తొల్లి తద్దయున్
హీనకులంబులందు జనియించిన మానవులైన సద్గుణ
శ్రీనిధులైనచో నలుసుచేయక గౌరవ బుద్ధితోడ స
మ్మానపురస్సరంబుగను మన్నన చేసెడువారు భక్తులున్
జ్ఞానులు, మౌనులున్, గవులు, సాధ్వులు, యోధులు బ్రహ్మజాతి చం

---

(౯) "శ్వమాంసము (కుక్కమాంసము) దినువారు శ్వపచులు-" లింగాభట్టీయము—మరియు, శ్వపాకులనుటకు—శ్లో. క్షత్తుర్జాత స్తథోగ్రాయాం శ్వపాక ఇతికీర్త్యతే. క్షత్త యనువానికి ఉగ్రకన్యయందుఁ బుట్టినవాఁడు శ్వపాకుఁడు. శూద్రునివల్ల క్షత్రియస్త్రీయందుఁ బుట్టినవాఁడు క్షత్త. క్షత్రియునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడు ఉగ్రుఁడు.

మనుస్మృతి దశమాధ్యాయము.

దాన రహించినందుల నుదాహరణంబులు పెక్కులున్న; వే
హోని జనింపలేదు మన హైందవసంతతి కందువల్ల, దే
శానికి మేలెకల్గె, మనజాతి గరిష్ఠతహెచ్చె నిప్పుడున్
మానక పూర్వికుల్ చనినమార్గమునన్ మన మేగుటొప్పగున్. ౧౧

ఉ. ఆదిమభాషయై భువన మంతట రంజిలు దేవభాషయం
దాదిమహా కవీంద్రుఁడయి యాదిమహాకృతికర్తయై మహేం
ద్రాది సురార్చితుండగు మహామునిచంద్రుఁడునైన యమ్మహా
వేదవిదుండు వాల్మికి పవిత్రుఁడు మున్ను నిషాదుఁడేకదా! ౧౨

ఉ. వేదవిభాగమున్ జలిపె విశ్వము సర్వముఁ బ్రస్తుతింప; న
ష్టాదశ సత్పురాణములు శస్త్రమతిన్ విరచించె; సర్వలో
కాదరణీయమైన యితిహాసము భారతమున్ రచించె; న
బ్జోదరు నంశ సంభవము నొందెను వ్యాసుఁడు నిమ్నజాతుఁడే. ౧౩

తే. వ్యాసమునిచంద్రుఁ గన్న పరాశరుండు
మాలదానికిఁ బుట్టి బ్రహ్మర్షి యయ్యె
వేశ్యకును బుట్టి మాలెతఁ బెండ్లియాడి
యావసిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె. ౧౪

క. వేదవ్యాసునకును వే
శ్యోదరమున జన్మమెత్తి యుజ్జ్వలమతియై

---

(౧౨) మహామహోపాధ్యాయ హరప్రసాదశాస్త్రిగారి వాల్మీకిచరిత్రము.

(౧౩) శ్లో. జాతో వ్యాసస్తు కైవర్త్యాః శ్వపాక్యాస్తు పరాశరః. భారతము, అరణ్యపర్వము. నీచజన్ములగు సత్యవతీపరాశరుల పుత్రుఁడు వ్యాసుఁడు— భారతము, అదిపర్వము.

(౧౪) శ్లో. శ్వపాకీగర్భసంభూతో పితా వ్యాసస్య సత్తమః. భవిష్యత్పురాణము.
శ్లో. జాతో వ్యాసస్తు కైవర్త్యాః శ్వపాక్యాస్తుపరాశరః.
భారతము, అరణ్యపర్వము.

(౧౫) భారతము, శాంతిపర్వము. దేవీభాగవతము, ప్రథమస్కంధము.

యాదిమతత్త్వముఁ గనుఁగొని
తాదీపింపఁడె శుకుండు ధన్యుండగుచున్. ౧౫

మ. మునిచంద్రుండగు నవ్వసిష్ఠు సతియై, ముల్లోకముల్ మెచ్చు రీ
తిని వర్తించి, లసద్గుణాఢ్య యయి, పాతివ్రత్యమాహాత్మ్యమున్
దనరారన్ వరతారయైపొలిచి మింటన్ దంపతీలోక వం
దనముల్ గాంచు నరుంధతీసతియుఁ జండాలాంగనారత్న మే! ౧౬

ఆ. భక్తవరదుఁడైన పండరిపురనాథుఁ
డతి నికృష్ట జాతుఁడైనయట్టి
నామదేవు భక్తికై మెచ్చి యాతని
యెంగిలన్న మారగింప లేదె? ౧౭

తే. బ్రాహ్మణ శ్రేష్ఠుఁడైన భార్గవుఁడు తొల్లి
ద్విజులు లేని యొకానొక దేశమందు
సర్వసముఁడౌచుఁ గైవర్తజాతిజనుల
జందెములువైచి విప్రులఁ జలుపలేదె? ౧౮

తే. పంచములు మ్లేచ్ఛులును విష్ణుభక్తి మెఱసి
వైష్ణవులు పూజసేయు నాళ్వారులైరి

(౧౬) శ్లో. అక్షమాలా (అరుంధతి) వసిష్ఠేన సంయుక్తాధమయోనిజా,
సారంగీ మందపాలేన జగామాభ్యర్హణీయతామ్. (మనుస్మృతి)
స్త్రీభక్తవిజయము.

(౧౭) భక్తవిజయము. ఆచార్యసూక్తి ముక్తావళి.

(౧౮) శ్లో. అబ్రహ్మణ్యే తదా దేశే కైవర్తాన్ ప్రేక్ష్యభార్గవః,
......యజ్ఞసూత్రమకల్పయత్.
స్థాపయిత్వా స్వకీయే స క్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్.
స్కాందపురాణము, సహ్యాద్రిఖండము.

(౧౦) ఆచార్యసూక్తి ముక్తావళి.

మంగయాళ్వారుఁ డొక మ్లేచ్ఛపుంగవుండు
మరి తిరుప్పాణి యాళ్వారు మాలవాఁడు. ౧౯

ఆ. క్షేత్రరాజమై పవిత్రస్థలంబై ప్ర
సిద్ధిఁ గన్నయట్టి శ్రీ పెరుంబు
దూరునందు మాలవారె రామానుజ
స్వామిరథము నడుపవలయుఁ గాదె! ౨౦

తే. అల్ల మైసూరు రాజ్యంబునందు వెలయు
మేలుకోటను విష్ణుదేవాలయమున
నేడునుం గూడ సంక్రాంతి మూఁడునాళ్లు
పంచములె సేయుదురు గాదె స్వామిసేవ. ౨౧

తే. అల మహారాష్ట్ర దేశంబునందు వెలయు
పండరి పురంబునను స్వామి స్యందనంబు
నుత్సవావసరంబుల నొప్పమీఱ
నడుపువారలు గోసంగి నరులు గారె? ౨౨

క. పావనమగు పండరిపుర
దేవళమున మాహరు లనఁగ, ఢేఢులనంగా
లేవే విగ్రహములు; మది
భావింపఁగ నవియు శ్వపచ ప్రతిమలు గావే? ౨౩

క. రామానుజ ధర్మస్థుఁడు
ధీమణి క్షుత్పీడితుండు తెలియ నవాచ్య

---

(౨౦) దుగ్గిరాల వేంకటసూర్యప్రకాశరావుగారి యుపన్యాసము. మానవసేవ.

(౨౧) "మైసూరురాజ్యమునందలి మేలుకోట వైష్ణవదేవాలయమున సంక్రాంతి దినములలో మూఁడునాళ్లు మాలవాండ్రు దేవున కర్చకులుగానుండి బ్రాహ్మణులకు సహితము శఠగోపముమ ప్రసాదము నిత్తురు." సూర్యప్రకాశరావుగారి యుపన్యాసము. మానవసేవ.

(౨౨) (౨౩) సూర్యప్రకాశరావుగారి యుపన్యాసము, మానవసేవ.

(౨౪) పండిత రామభుజదత్తుగారి యుపన్యాసము.

బ్రాహ్మణిగాఁడే? యాతని
స్వామిగఁ బ్రేమింపలేదె వైష్ణవులెల్లన్? ౨౪

క. రామానందుల శిష్య
గ్రామణులు మహమ్మదీయగణములకున్ శ్రీ
రామానుజమత మియ్యరె?
ప్రేమింపరె వైష్ణవులు పవిత్రులటంచున్? ౨౫

క. వన భూషణుఁ డను విద్వ
న్మణి, విష్ణు స్వామి యనెడు మహనీయుండున్,
ఘనుఁడగు నింబాదిత్యుఁడు
మును మ్లేచ్ఛుల శుద్ధి చేసి పూజ్యత నిడరే! ౨౬

ఆ. పండరీపురానఁ బాండు రంగ విభుండు
చోకమేళుఁడను శ్వపాకు భక్తి
మెచ్చి దర్శనంబు నిచ్చి సంభాషించి
కూర్మితోడ వాని కూడుఁ దినఁడె! ౨౭

తే. స్వాదులో చేదులో యంచు సంశయించి
యించుకించుక రుచి చూచి మంచి వెంచి
ఫలము లిడిన శబరి మూఢ భక్తి మెచ్చి
యెలమి భుజియింపఁడే రాముఁ డెంగిలనక? ౨౮

---

(౨౫) రామభుజదత్తుగారి యుపన్యాసము.

(౨౬) "నింబాదిత్యుడు కాశీనగరమున మహమ్మదీయ మతమును ఖండించి మహమ్మదీయులను శుద్ధిచేసి హిందువులలోఁ గలిపెను. హరిద్వారమందు విష్ణుస్వామియు, మరికొన్నిచోట్ల వనభూషణుఁడును మ్లేచ్ఛులకుఁ బ్రాయశ్చిత్తము చేయించి హిందువులలోఁ గలిపిరి."

పండిత రామభుజదత్తుగారి యుపన్యాసము.

(౨౭) భక్తవిజయము.

(౨౮) వాల్మీకిరామాయణము.

తే. పంచముఁడు రోహిదాసుఁడు భక్తుఁడగుచుఁ
జర్మపాత్రములందె యర్చనముఁ జేసి
విష్ణుసందర్శనముగాంచి విబుధుఁడైన
దేశికుఁడు మెచ్చ ధన్యుఁడై తేజరిలఁడె? ౨౯

తే. ఏకనాథుండు సద్భక్తలోకవరుఁడు
సాధు భూసురవర సమారాధనమున
ముందుగా మాలలకు నెల్ల విందుఁజేసి
యాదరింపఁడె దీన దయాళుఁ డగుచు? ౩౦

క. నందుఁడు చిదంబర పురము
నం దుదయము నంది భక్తుఁడై సర్వ జనా
నందుఁడు గాఁడే! పూజ్యత
నందఁడె యాతండు పంచమాగ్రణి గాఁడే! ౩౧

తే. విష్ణుదేవుని భక్తుఁడై విబుధుఁడైన
యంత్యజుఁడె యెదురైన 'దాసోహ' మనుచు
వైష్ణవవరుండు సాష్టాంగవందనంబు
సేయవలె నంట తత్సాంప్రదాయము గద! ౩౨

---

(౨౯) (౩౦) భక్తవిజయము.
(౩౧) నందచరిత్రము.
(౩౨) శ్లో. వైష్ణవం వైష్ణవో దృష్ట్వా ప్రణమే ద్దండవద్భువి.
వైష్ణవుఁడు వైష్ణవునిఁ జూచినంతనే దండప్రణామము చేయవలయును.
భక్తవిజయము.

శ్లో. యః పశ్యతి శుభాచారం వైష్ణవం వీతకల్మషమ్,
యస్మిన్ కస్మిన్ కులే జాతం ప్రణమే ద్దండవద్భువి.

శుభాచారపరుఁడును, దోషరహితుఁడును నగువైష్ణవునిఁ జూచినయెడల కులముతో నిమిత్తము లేకయే వైష్ణవుఁ డతనికి నేలమీఁద సాగిలఁబడి మ్రొక్కవలయును. భక్తవిజయము.

ఉ. క్షత్రియుఁడై జనించి బహుకాలము ఘోరతపంబుఁ జేసి లో
కత్రయముక్ భజింప సరిగాఁ బ్రతిసృష్టి యొనర్చి సృష్టికిక్
ధాత్రిసురత్వమున్ బడసి ధన్యతఁ గాంచిన గాధిరాజ ప
త్పుత్త్రుఁడు మాలెతల్ తనకుఁ బుత్రికలే యని గారవింపఁడే! 33

క. మారోపంతను నట్టి మ
హారాష్ట్రుఁడు భక్తగణమునందు బుధులచేఁ
జేరుపఁబడి పొగడొందఁడె?
దారగ నాతండు మాలెతను జేకొనఁడే? 34

---

శ్లో. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః

విద్యావినయసంపన్నుఁడగు బ్రాహ్మణునియందును, గోవునందును, ఏనుఁగు నందును, కుక్కయందును, దానిమాంసముఁ దినువానియందును బండితులు సమదర్శనులై యుందురు. భగవద్గీత.

శ్లో. శ్వపచోపి మహీపాల విష్ణుభక్తో ద్విజాధికః,
విష్ణుభక్తి విహీనస్తు యతిశ్చ శ్వపచాధమః.

శ్వపచుఁడైనను విష్ణుభక్తుఁడైనయెడల బ్రాహ్మణునికన్న నధికుఁడగును. విష్ణుభక్తిలేనివాఁడు యతియైనను శ్వపచునికన్న నధముఁడగును.—భాగవతము.

శ్లో. చక్రాంకితభుజం దృష్ట్వా యస్తు తం నాభివాదయేత్,
తిర్యగ్యోనిశతం ప్రాప్య విష్ఠాయాం జాయతే క్రిమిః.

ఎవ్వఁడేని చక్రాంకితభుజునిఁ జూచి యభివాదనంబు సేయకుండు వాఁడు తిర్యగ్యోని శతంబునొంది నికృష్టతమక్రిమి జన్మంబుఁ జెందును.

భవిష్యత్పురాణము.

(33) హరిశ్చంద్రోపాఖ్యానము, స్కాందపురాణము, మార్కండేయపురాణాదికములు.

(34) మహారాష్ట్రభక్తవిజయము—ప్రకాశరావుగారి యుపన్యాసము.
మానవసేవ.

క. తిరువళ్లూరు పురంబున
ధరణీసురునకును మాలెతకు నందనుఁడై
పరగిన కపిలుఁడు పావన
పురుషుండై ఋషులలోనఁ బూజ్యతఁ గనఁడే! 3౫

తే. మేటి పల్నాఁటి వీర కిరీటమైన
బ్రహ్మనాయఁడు గోసంగిపడుచునందుఁ
గొడుకులను గాంచఁడే తనకాలమునందు
వన్నె వాసియు నతనికి సన్నగిలెనె? 3౬

ఆ. జాతిహీనుఁడైన జాబాలి పుత్త్రుని
సత్యకాముఁ డనెడు సచ్చరిత్రు
గౌతముండు బ్రహ్మజాతిలోఁ జేర్పఁడే
యెల్ల ద్విజులు దాని కియ్యకొనరె? 3౭

తే. మున్ను 1 వ్యాదకర్ముఁడను నొక్క పుల్కసుండు
క్షితిసురోత్తముఁడై ప్రకాశింపలేదె!
అధమజాతి 2 యయిలోపి బ్రాహ్మణుఁడు గురుఁడు
ఋషివరుండును నై తేజరిల్లలేదె! 3౮

తే. మున్ను యాగక్రియాలోపమునను బ్రహ్మ
రాక్షసత్వంబు నొందిన బ్రాహ్మణునకుఁ
కైశికీ గీత మహిమ నక్కజము గాఁగ
మనుజరూపం బిడఁడె యొక్క మాలవాఁడు? 3౯

---

(3౫) ప్రకాశరావుగారి యుపన్యాసము. మానవసేవ.
(3౬) వీరభాగవతము, శ్రీనాథుని పల్నాటివీరచరిత్రము.
(3౭) ఐతరేయబ్రాహ్మణము.
(3౮) ౧ భవిష్యత్పురాణము, ౨ ఐతరేయబ్రాహ్మణము, ఋగ్వేదము పదియవమండలము.
(3౯) శ్లో. ఏవ ముక్తాతు మాతంగం రాక్షస శ్శరణంగతః......

క. ధర్మరతుఁడు కౌశికముని
ధర్మవ్యాధునిగృహంబుఁ దరియఁగ నాతం
డర్మిలిఁ బూజింపఁగ నా
నిర్మలుఁ డాయనఘుచేతి నీరముఁ గొనఁడే? ౪౦

ఆ. అల్ల రంతిదేవుఁ డాహార మొదవక
నీరములను ప్రాణి నిలుపఁగోరి
యున్నయంత మాల యొక్కండు తనువేఁడ
నుదక మిచ్చి వాని నోమలేదె? ౪౧

తే. పూర్వము ప్రసేనజిత్తను భూపతిలకు
నందన కురంగి యన నొప్పు సుందరాంగి
మదగజము పాలు గాకుండ మనిచినట్టి
మాలకొమరునిఁ బెండ్లాడి క్రాలలేదె? ౪౨

---

శ్లో. యన్మయా పశ్చిమం గీతం స్వరం కైశిక ముత్తమం,
ఫలేన తస్య భద్రం తే మోక్షయిష్యతి కిల్బిషాత్.

అను కైశికపురాణోక్తిక్రమంబున బ్రహ్మరాక్షసునియందు యజ్ఞాంగలోపాగతదోషంబుఁ బరిహరించి రక్షించు పరమభాగవతోత్తముని కైవడి.........
ఆచార్యసూక్తిముక్తావళి, తిరుప్పాణియాళ్వారుల చరిత్రము. భక్తవిజయము.

(౪౦) అరణ్యపర్వము, భారతము.

(౪౧) ఉ. అన్నము లేదు కొన్ని మధురాంబువులున్నవి త్రావుమన్న! రా
వన్న! శరీరధారులకు నాపదవచ్చిన, వారి యాపదల్
క్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకన్న నొండు మే
లున్నదె? నాకుఁ దిక్కు పురుషోత్తముఁ డొక్కఁడె సుమ్ము పుల్కసా!

అని చెప్పి రాజర్షి యగు రంతిదేవుఁడు మాలవాని పాత్రలో నుదకము వోసెను,
భాగవతము.

(౪౨) కథాసరిత్సాగరము.

ఆ. మలయసింహుపట్టి మాయావతి యనంగ
వెలయు కన్య తన్ను వలచినట్టి
సుప్రహరుని మాలసుతు నుపలాలించి
వాని* నను గమించి వరలలేదె? ४३

ఆ. ఉజ్జయినిపురాన నుత్పల హస్తుఁడన్
పేరి మాలవాని ప్రియకుమారి
వలచి యా యవంతి వర్ధనుఁడనురాజ
సుతుఁడు పెండ్లియాడి సుఖముఁ గనఁడె? ४४

తే. చారుతరకీర్తి శ్రీహర్ష చక్రవర్తి
సభను బాణ మయూ రాది సత్కవీంద్ర
తుల్య సత్కార గౌరవాదులను గాంచి
తనరఁడె దివాకరుండు మాతంగజుండు? ४५

---

(४३) * అనుగమము = సహగమనము కథాసరిత్సాగరము.

(४४) కథాసరిత్సాగరము.

(४५) ఇరువదియొకటవ కృష్ణా గుంటూరు మండల సంఘసంస్కరణసభాధ్యక్షులగు శ్రీ. వే. లక్ష్మణరావుగారిట్లు చెప్పియున్నారు: "నేను కొన్ని దినముల క్రిందట "హర్ష చరిత్ర "మను మహారాష్ట్ర గ్రంథమును జదువుచుండఁగా నొకవింత చరిత్ర గానవచ్చినది. హర్ష చక్రవర్తికాలమున దివాకరుఁడను "మాతంగు" డనఁగా మాదిగకొలమువాఁడు గొప్పకవియై యుండెను. అతని విద్యామాహాత్మ్యమును జూచి శ్రీహర్ష చక్రవర్తి యాతనిని బాణ మయూర మహాకవులతో సమానముగాఁ దనసభయందు సభ్యునిఁగా చేర్చుకొనెను. అనఁగా మాతంగదివాకరుఁడు శ్రీహర్షుని యాస్థాన కవీశ్వరుఁడుగా నుండెను. రాజశేఖరకవి యిందునుగురించి యిట్లు వ్రాసియున్నాఁడు:

శ్లో. అహో ప్రభావో వాగ్దేవ్యాః యన్మాతంగ దివాకరః,
శ్రీహర్షస్యాభవత్ సభ్యః సమో బాణమయూరయోః.

తే. హృద్య తరమైన గాంధర్వ విద్యయందు
నైపుణంబును జూపి యానంద మిచ్చి
శ్రీ హరిశ్చంద్ర చక్రవర్తికి మనంబు
వెతలు దీర్చిన వారు మాలెతలు గారె? ౪౬

ఆ. యామునార్య శిష్యుఁడై, పరిపూర్ణ దే
శికవరేణ్యు వలన సేవఁ గాంచి
పెరియనంబిచేతఁ జరమక్రియలు గొన్న
మారనూరినంబి మాలగాఁడె? ౪౭

గీ. కాశికాపురి నాదిశంకరుఁడు విజ్ఞుఁ
డైన చండాలువలన సుజ్ఞాన మెఱిఁగి
మెచ్చి యతనికి జగమెల్ల రిచ్చవడఁగఁ
బ్రేమ సాష్టాంగ దండప్రణామ మిడఁడె! ౪౮

క. మాలిన్యంబును దలఁపక
ధీలలితుండైన బుద్ధదేవుఁడు గురుఁడై
మాలని లాలింపఁడె, నయ
లాలిత కరుణావిలాస లాలసుఁ డగుచున్! ౪౯

ఆ. శుభ్రకీర్తి యగు నశోకవర్ధన చక్ర
వర్తి భిక్షువులగు పంచములను
భక్తిపూర్వకముగఁ బ్రార్థించి పూజించి
గౌరవించి గణుతిఁ గాంచలేదె? ౫౦

---

(౪౬) హరిశ్చంద్రోపాఖ్యానము, మార్కండేయపురాణము.
(౪౭) ఆచార్యసూక్తిముక్తావళి.
(౪౮) శంకరాచార్యులమనీషాపంచకము, శంకరవిజయము, విశ్వేశ్వరపర్వము
(౪౯) బుద్ధచరిత్రము.
(౫౦) అశోకచరిత్ర.

తే. తొల్లి కణ్వమునీంద్రచంద్రుండు మ్లేచ్ఛ
దేశమైన ఐగుప్త కేతెంచి యచట
వేలకొలఁది మనుష్యుల వేదమతము
నందుఁ జేర్పఁడె? వారు పూజ్యతను గనరె? ౫౧

తే. వారిలోపలఁ బృథుఁ డనువాఁడు ఖ్యాత
వంతుఁడై, భూమికాంతుఁడై మంతుకెక్క
మగధ రాజ్యంబు స్థాపించి మాన్యుఁడైన
మాగధుం డాతని కుమారమణియె కాడె? ౫౨

తే. ఎల్ల హిందువులును నుపాసించు దేవ
గణములోపల మాతంగకన్య లేదె?
అల్ల మాతంగవంశజు లెల్లవారు
హిందువుల దైవముల నుపాసింత్రుగాదె? ౫౩

---

(౫౨) భవిష్యత్పురాణము.

(౫౩) శ్లో. మాణిక్యవీణాముపలాలయంతీం మదాలసాం మంజులవాగ్విలాసాం,
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం మాతంగకన్యాం మనసా స్మరామి.

శ్లో. మాతా మరకతశ్యామా మాతంగీ మధుశాలినీ,
కుర్యా త్కటాక్షం కల్యాణీ కదంబవనవాసినీ.

శ్లో. జయ! మాతంగతనయే! జయ! నీలోత్పలద్యుతే!
జయ! సంగీతరసికే! జయ! లీలాశుకప్రియే! —కాళిదాసు.

శ్లో. .........మతంగమునికన్యకాం మధురభాషిణీమాశ్రయే.
శంకరాచార్యకృత త్రిపురసుందరీస్తోత్రము.

శ్లో. జయ! మాత ర్విశాలాక్షి! జయ! సంగీతమాతృకే!
జయ! మాతంగి! చండాలి! గృహీతమధుపాత్రకే!
శ్యామలాస్తోత్రము, బృహత్స్తోత్రరత్నాకరము.

శ్యామలానవరత్నమాలాస్తోత్రాదిప్రమాణము లనేకము గలవు.

ఆ. దిక్కు మొక్కు లేని దీనుల శవములు
శ్వపచకులు లెత్తి మోయు వలయుననుచు
సర్వ ధర్మ శాస్త్ర చయ మేకముఖమై వి
ధింప దొక్కొ? బుధులు తెలియ రొక్కొ? ౫౪

క. మలయాళముతీరంబునఁ
బొలుపారెడు తులువదేశమును బంచములే
నెలకొని యేలరె? రాజ్యము
నెలకొలుపరె మున్ను? శౌర్య నిరతులు గారే? ౫౫

క. నందుఁ డనునతఁడు ప్రజ లా
నందము నందంగఁ బాలనము సేయఁడె? ఆ
నందవరంబున నాతని
మందిర చిహ్నంబు లిపుడుమాత్రము లేవే? ౫౬

క. ఆనందుని వంశంబున
కానందముఁ గూర్పఁ గనకుఁడను వాఁ డుదయం
బై నిఖిల విద్య లారసి
జ్ఞానియు సుకవియును నగుచు ఖ్యాతినిఁ గనఁడే? ౫౭

ఉ. మాలల కన్న నీచతర మానవులౌ కొరగారు వంశ భూ
పాలుర కన్యఁ గైకొనఁడె పావనుఁడైన మయూర ధారుణీ
పాలుని పట్టి? మిత్రులుగ బ్రాహ్మణు లుండరె వారిసన్నిధిన్
బోలగఁ బంచముల్ మరలఁ బ్రోన్నతి నొంది సుఖింపఁ బోలదే! ౫౮

---

(౫౪) శ్లో. అబాంధవం శవంచైవ నిర్హారేయు రితిస్థితిః.
(చండాలురు, శ్వపాకులు) బంధువులు లేక చనిపోయిన యనాథప్రేతము నెత్తవలయును. ఇది వారలకు ధర్మము. మనుస్మృతి దశమాధ్యాయము.
(౫౫) (౫౬) (౫౭) సూర్యప్రకాశరావుగారి యుపన్యాసము, మానవసేవ
(౫౮) సూర్యప్రకాశరావుగారి యుపన్యాసము, మానవసేవ. "స్త్రీరత్నం దుష్కులాదపి"—మనుస్మృతి.

ఆ. మందపాలుఁ డనెడు మౌనీంద్ర చంద్రుండు
కడు నికృష్టజాతి కన్య యయ్యె
సాధుశీలయైన సారంగిఁ బెండ్లాడి
యావసిష్ఠులీల నలర లేదె? ౫౯

క. భూమీశ చంద్రుఁడగు వి
శ్వామిత్రుఁడు ఘోరతర తపశ్శక్తి మెయిన్
భూమిసురుఁడు, బ్రహ్మర్షి
గ్రామణి, ధీమణియునై ప్రకాస్తినిఁ గనఁడే! ౬౦

ఆ. భృగుమహర్షి చంద్రుకృపవల్ల బ్రహ్మర్షి
యయ్యె వీతహవ్యుఁ డనెడు రాజు
అవనిభర్తయైన యువనాశ్వపుత్రుండు
భూసురత్వ మొంది పూజ్యుఁడయ్యె. ౬౧

క. మేనకకు గాధిపట్టికి
మేనత్తియుఁ గణ్వమహరిమునుమారికయై
రాణించు శకుంతల త
త్సూనుఁడు భరతుండు సుచరితులుగా లేదే? ౬౨

తే. పూర్వమున ద్విజులకు నందు భూపతులకు
నాలుగవజాతివారె వంటలను జేయు
వాడుకయటంచు మునులును బ్రాహ్మణులును
సాపడెడువారనుచుఁ గృతుల్ చాటుఁగాదె? ౬౩

---

(౫౯) శ్లో. అక్షమాలా వసిష్ఠేన సంయుక్తాధమయోనిజా,
సారంగీ మందపాలేన జగామాభ్యర్హణీయతాం. మనుస్మృతి.

(౬౦) వాల్మీకిరామాయణము,

(౬౧) ౧ భారతము, ౨ భాగవతము.

(౬౨) భారతము.

(౬౩) భారతము, విరాటపర్వము. అనిదోషము లేదని మనుస్మృతి.

తే. చ్యవనుఁ డనుఋషికులసతీసహితుఁడగుచుఁ
బోయి కుశికప్రభుని యంతిపురములందు
సిద్ధమగు వంటకమును భుజించుచుండి
యచ్చటనె కాలమును బుచ్చెననఁగ వినమె! ౬౪

తే. క్షత్త వండినయన్నంబు క్ష్మాసురులకు
విందువెట్టించి తినఁడె గోవిందుఁ డల్ల
విదురు నింటను గుడువఁడే ప్రియముతోడఁ
గులముఁ జూచెనె కృష్ణుండు గుణముగాక. ౬౫

తే. ప్రాణములు పోవునట్టి యాపదలయందు
వేదవిదుఁడగు విప్రకలాదుఁడైన
జాతిహీనుల యన్నంబు సాపడినను
దోష మంటదనుచు స్మృతుల్ ఘోషలిడవె? ౬౬

ఆ. పూరిముఖ్య పుణ్య పురసప్తకముఁ జొచ్చి
హైందవులను బలిమి యవనులెల్ల
మ్లేచ్ఛులుగ నొనర్పఁ గృష్ణచైతన్యుల
శిష్యవరులు మరలఁ జేర్చుకొనరె? ౬౭

(౬౪) ఆనుశాసనికపర్వము, భారతము.

(౬౫) భారతము, ఉద్యోగపర్వము. శూద్రునకు రాచకన్యకయందుఁ బుట్టినవాఁడు క్షత్తయని మనుస్మృతి, దశమాధ్యాయము.

(౬౬) శ్లో. జీవితాత్యయ మాపన్నో యోన్న మత్తి యతస్తతః,
ఆకాశమివ పంకేన న స పాపేన లిప్యతే.

బ్రాహ్మణుఁడు (చచ్చిపోవునంతటి) ఆపత్కాలమందుఁ బ్రతిలోమజాతివాఁడు మొదలైన యెవని యన్నమును భుజించినను బురదయందలి యాకాశమువలె వానియందు గొంచెమేని పాప మంటదు. వామదేవ విశ్వామిత్రాది మహర్షులు దీని కుదాహరణము. మనుస్మృతి, దశమాధ్యాయము.

(౬౭) రామభుజదత్తుగారి యుపన్యాసము.

తే. చిత్స, చందను లనుపేర్లఁ జెలఁగునట్టి
యవనులను శుద్ధిజేసి హిందువులఁజేసి
చిత్ర, చంద్రాఖ్యలనుబెట్టి స్నేహభావ
మలర మెలఁగిరి మనపూర్వు లనఁగవినమె! ౯౮

ఆ. వారుపుట్టినట్టి వంశంబు లెయ్యాని?
వార లెంతలేసివార లైరి?
జాతి యేదియైన నీతియే ముఖ్యంబు
నీతిలేకయున్న జాతిసున్న. ౯౯

తే. జందెములు దీసి పూర్వులు జాతి విడిచి
భ్రష్టులైనను ముందుతరంబునరులు
ద్విజులు గావచ్చు శుద్ధులై తరిగి యనుచు
మనువు మొదలైన వేత్తల మతముగాదె? ౧౦౦

క. జననంబు చేతఁ జూచిన
జను లెల్లరుఁగూడ నేకజాతియె యనుచున్
మనశాస్త్రములు సమస్తముఁ
బెనురొద మిన్నుముట్ట ఘోష పెట్టుటలేదే? ౧౦౧

---

(౯౮) జన్నూరు శాసనమునఁ గలదని భండార్కరుగారు వ్రాసిరని రామభుజదత్తుగారి యుపన్యాసము.

(౧౦౦) ఆపస్తంబ సూత్రములు, మనుస్మృతి.

(౧౦౧) శతపథ బ్రాహ్మణము, భగవద్గీతలు, భాగవతము, రామాయణము, భారతము, సాంఖ్యశాస్త్రము, బృహదారణ్యకోపనిషత్తు మొదలగునవి. ఒక యుదాహరణము—

శ్లో. న జాతిః పూజ్యతే రాజన్ గుణాః కల్యాణకారకాః
చండాల మపి వృత్తస్థం తం దేవా బ్రాహ్మణం విదుః.

భారతము, అశ్వమేధపర్వము.

క. ౧ హరినామ స్మరణము భవ
హరణము, ౨ శ్రీరామ నామ మను మంత్రము శ్రీ
కర పుణ్యకరముగద! యీ
తరణోపాయమునఁ బ్రోవఁదగు బంచములన్. ౨౨

తే. నాగరికు లైన యార్యు లీభాగమునకు
రాక ముందటి నుండి స్థైర్యముగ నుండి
ఆంధ్ర భూమికిఁ గాణాచు లైన మాల
వాండ్ర నిటుఁ ద్రోసి పుచ్చుట పాఁడియగునె? ౨౩

మ. మనదేశంబున జన్మమెత్తి మనక్షేమంబున్ సదాకోరి తా
మనయంబున్ మన సంఘవృద్ధికయి దాస్యం బొప్పగాఁ జేయుచున్
మనదైవంబులఁ గొల్చుచున్ మన మతామ్నాయ ప్రకారంబుగా
మనుచున్నన్ మనదేశ సోదరులె యన్మాటన్ విచారింపమే! ౨౪

మ. మనకున్ సోదర వర్గ మాదురు సుడీ మాలల్ సహో; హిందు భూ
జననీ గర్భము నందె కాంచిరి సుడీ జన్మంబు; నీదేశమం
దున సర్వేశ్వరు సత్కృపన్ గలుగు వస్తువ్రాతమున్ బొందఁగా
మనతోఁ బాటధికారమున్నది సుడీ మాతంగపుంజాతికిన్. ౨౫

ఉ. దేవుఁడె కన్నతండ్రి జగతిన్ జనియించినవారికెల్ల; భూ
దేవియె కన్నతల్లి, యిదితెల్లము; మానవకోటియెల్లరున్
వావికి నన్నదమ్ములు; లవత్వఘనత్వములున్ స్వభావముల్
కా; విఁక వర్ణభేదములు కాల్పనికంబులు! లాతిసీమలన్
లేవివి; వీనివల్ల లవలేశము లాభముఁ గల్గఁబోదు; ము
న్నే విధివృత్తులన్ గురిఁచియే నియమించిరి పెద్దవార; లే
త్రోవలఁజూచినన్ శుచికి దూరగులౌటనె మాలవారలన్
బోవిడనాడినారు మనపూర్వులు ప్రస్తుతదేశకాల పా
త్రావసరంబులన్ గని యుదారమనస్కులు దేశనాయకుల్

(౨౨) ౧ విష్ణుపురాణము, ౨ గరుడపురాణము.

ధీవరు లీయభాగ్యులకు దిక్కయి నిల్చిరి, తొంటినీచపుం
భావము మాటిపోయినది పండితకోటికి; నేఁటికింక నున్
గేవలపూర్వపద్ధతుల క్రీనలఁబోవఁ దలంచువ్రాన్క తా
నేపగనైన నేటి కెదురీఁదుటవంటిది; కాల మేగతిన్
బోవునొ తాను నాగతినె పోవుట కోవిదలక్షణంబగున్
గావున దేశ కాలముల కైవడు లారసి నిమ్నజాతులన్
గావలులంచుఁ బోవిడక కారుణికోత్తములెల్లఁ బ్రోవరే! ౭౬

సీ. ఊరిలోఁ గాపురముండనీకుండుట
నీళ్ళ రేవులఁజేరనీకయుంట
వీథిలో స్వేచ్ఛగా విహరింపనీకుంట
నీచభావముతోడఁ జూచుచుంట
పల్లెకూటములకు వెళ్లనీకుండుట
మోసాలలోపల ముంచుచుంట
వైద్యసాహాయ్యంబు వడయనీకుండుట
మతధర్మ నియమముల్ మప్పకుంట
తే. నాహనారోహణాది కౌతూహలములు
నాటకాలోకన వినోదనాదికములు
లేకయుండంగఁ జేయుట లెక్కవెట్టఁ
గలమె మాలలఁబెట్టు నిక్కట్టు లకట! ౭౭

మ. మనదేశీయుల నేకజాతినరులన్ మాలిన్యమంచున్ మిమన్
మనమే న్యాయము మూలఁద్రోచి. కరుణన్ మాయించి, స్వత్వంబులె
ల్లను దుర్వృత్తిహరించి, హింసలిడుచున్, లాతుల్ వెతల్ బెట్టఁగ
న్గొని హా! హా! యని యంగలార్చెదము లోకుల్ విన్నచో నవ్వరే! ౭౮

చ. దయయును ధర్మమున్ గడకుఁ దారిచి వేలకొలంది యేండ్ల నుం
డియు నిటుమాలవాండ్రను గడించి బెడందలఁ బెట్టుచుంట నెం

తఱుఁ బరిపాటియై మనకు దారుణవృత్తిగఁ దోఁచకుండుఁగా
క యితరు లివ్విధంబుఁ బొడఁగాంచిన గుండెలు వ్రీలి చావరే! ౬౯

మ. నరజన్మంబిది యుత్తమంబనుచు నానాదేశ విద్వాంసులున్
వరుసన్ రూఢియొనర్చినట్టి పలుకున్ వ్యర్థంబుఁగావించి యి
ట్లగరే! మడ్డిమృగాలు మానవులు వియ్యాం బందుచున్నారు; భూ
సురులారా! దయఁజూచి పుల్కసులకున్ శుద్ధత్వమున్ నేర్పరే! ౭౦

ఉ. పావనులెల్ల మానవులుఁ బాపులు పంచము; లన్న నీచఃపుం
భావములోనఁ బంచముల భావనచేసిరి ఛాందసద్విజుల్:
కేవలపామరుల్ గనుక, కృత్రిమ మేమియెఱుంగలేక, యీ
కైవడినొప్పి, పంచములు గట్టిగఁ గ్రించుల మంచు నమ్మి, స
ద్భావముతోడుతన్ భయము, భక్తి గడల్కొనఁగా ద్విజన్మలన్
దైవములంచుఁ, దమ్మెప్పుడొ ధన్యులఁజేయుదు రంచున్ నెంచుచున్
సేవలుచేయుచుండి తమ జివిత మెంతయుఁ గష్టపుంజమై
చేవయు లావునుం జెడఁగఁ జేడ్పడి, గీడ్పడి, యాత్మగౌరవం,
బేవయు, లజ్జయున్ మరచి హేయగతిన్ జరియించి యీవగన్
హోవడి నొందుచుండినను హా! యని నొవ్వరు భారతీయు లా
హా! విపరీతధర్మముల యాగడముల్! జననంబుచేతనే
పాపులుఁ బుణ్యులౌదురె ప్రపంచమునం దెటులెందు నేనియున్. ౭౧

ఉ. కాకులుఁ బిల్లులున్ జెనకి కైకొనఁగాఁ గనుఁగొన్నయన్న మే
సాకున లేక భూసురులె సాపడుచుందురు, విందు వెట్టఁగాఁ
బాకముచేసి రాసులుగ వైచిన యన్నముఁ జూచి పుక్క లే
తాకిన నెగ్గుసేయరు కదా! కనరాదె గోడారు లహ్హాహో! ౭౨

గీ. రాళ్ల అప్పలఁ గనుఁగొని రహిని మ్రొక్కి
చెట్టులను బుట్టలను బూజచేయునట్టి
హిందువులు తోడినరులను హీనులనుచుఁ
దలఁగఁ ద్రోయుట మతవిరుద్ధంబు కాదె? ౭౩

తే. ఈశ్వర ప్రతిరూపమై యొసఁగు నరుఁడు
నరుని కగు నవమాన మీశ్వరునిఁ జేరు
మానవుల నవమానించు హీననరుఁడు
పాత్రుఁ డగు నీశ్వర ద్రోహ పాపమునకు. ౭౪

చ. తెలివిఁ దొలంగియున్న దురదృష్టులు, నీచులు, గర్భదాసులున్
బలితపు దైన్యదుర్గతుల బాములనొందెడు మందభాగ్యులున్,
మలినులు, మానహీనులగు మాలలు సోదరులంచు నోటితోఁ
బలికిన, వీనులన్ వినిన భారతకోటికి సిగ్గు గాదొకో ? ౭౫

చ. మనువున కప్రతిష్ఠ, ఋషిమండలికెల్లను నల్లచుక్క, చ
క్కని మన వేదశాస్త్రముల ఖ్యాతికిఁ దెచ్చిన మచ్చ, ధర్మఁపున్
ఖనులయి వన్నెఁ గన్న మతకర్తల కీర్తి కళాకళంక మీ
యనుచిత వృత్తిఁ బోవిడిచి యార్య లఖండయశంబు నొందరే. ౭౬

సీ. ఒడలిపై చర్మమే యొలిచిదానముచేసె
ననఘుండు కర్ణుఁ డెందవతరించె?
పులుఁగుకై మేనికండలు కోసి యిచ్చిన
శిబి మహోదాత యేక్షితినిఁ బుట్టె ?
ఎదఁ గొంకులేక వెన్నెముకనే యొసఁగిన
ఘనుఁడు దధీచి యెక్కడ జనించె?
పసుపుఁ బట్టలతోడఁ బ్రాణమే యిచ్చిన
జీమూతవాహుఁ డేసీమఁ బొడమె?
తే. అట్టి యీ " పుణ్యభూమి " యందకటకట!
యగ్రజాతులవారు మాధ్యంబుకతన
సాటిమానిసులను బానిసలను జేసి
గాసి నొందించుచున్నారకారణముగ. ౭౭

సీ. పవలు రేల్కష్టించి వ్యవసాయ మొనరించి
యుర్విని బండించుచున్నవారు

ప్రోది మీఱఁగ మంచి పాడిపంటల నొసంగి
యుడు సౌఖ్యమును గూర్చు చున్నవారు
ప్రతి గ్రామమున మృత పశు కళేబరముల
నోర్మిమైఁ దొలఁగించు చున్నవారు
గ్రామ రక్షణకునై యామికత్వము భద్ర
మొప్పారఁ గావించు చున్నవారు
ఆ. ప్రీతిమై ననాథప్రేత సంస్కారమ్ము
లెన్నొ యెడలఁ జేయు చున్నవారు
మనకు మేలు గూర్చు మాలల విడనాడఁ
దగునె! యిది కృతజ్ఞ ధర్మ మగునె! ౫౮

ఉ. వెన్నను గొట్టువారి నవివేకత దాతను మొత్తునట్లుగా
నన్నిఁటికిన్ సదా మన సమాశ్రయమున్ మదిఁ గోరియున్న యా
పన్నుల నీయమాయికులఁ బంచములన్ దయమాలి యీగతిన్
బన్నము లొందఁ జేయుటలు భావ్యమె భారతులార! చెప్పరే! ౫౯

సీ. చాలినంత వెలుంగు, గాలియు వచ్చు వి
శాలమై తగుప్రదేశాలు లేక
కటువు రోజులలోనఁ గాయ, కసరుఁ, గూడు,
దుంపయే కాని మెతుకులు లేక
మురుగు కాల్వలుఁ బెద్దముఱికి గుంటలలోని
నీరుఁ దక్కఁగ మంచినీరు లేక
ఎండవానలనుండి హిమవాతములనుండి
రక్షింపఁ జాలు వస్త్రములు లేక
గీ. జాడ్యములు పుట్టి యేటేట శ్వపచకులము
నాశనముఁ జేయుటయెగాక దేశమెల్ల
నంటువ్యాధులు వ్యాపించి యఖిలజనుల
ప్రాణములు దీయుచున్న వీపలుకు వినరె! ౬౦

ఉ. గంగ పవిత్రమైనదనిగా మరి హిందువులెల్ల దీర్ఘమే
గంగను, గంగలోన మునుగంగను, గంగను బూజచేసి మ్రొ
క్కంగను వేడుకం గనుట? గంగకు గల్గదు భేదబుద్ధి; మా
తంగుల నైన గావదను ధన్యులఁజేయునుగాని; యట్టి యా
గంగ నుమానుషంగను, జగజ్జనజన్మతరంగభంగ నే
భంగిని మాలమాదిగలు పట్టి యపావనముం బొనర్తు? రీ
సంగతి నించుకేనియు విచారణసేయక నీళ్లరేవు మా
తంగులు చేరరాదనుచుఁ దర్జన భర్జనచేసి వారి ని
ట్లంగద పాలుచేసి వగనందఁగ గుందఁగఁజేతు రోసుధీ
పుంగవులార! ధర్మ మనబోలునో పోలదో చూడరారె, వే
గం గతిగారె, వారి కడగండ్లను మాన్పి సుఖంబు గూర్పరే. ౯౧

సీ. మాల మాదిగలును మనవంటిమనుజులే!
వారి ప్రాణము మన ప్రాణమొకటె!
సర్వావయవములు సర్వేంద్రియములును
సర్వమానవులకు సమముగాదె!
నీర మాహారము నిద్రయు మనకును
వారికిఁ గూడ నావశ్యకములె!
వారల దేహంబువలె మన దేహంబు
రక్తమాంసాదుల రాశియగును!
తే. మోదఖేదాలు, సుఖదుఃఖములును, మరియుఁ
బుణ్యపాపాలుఁ, గలిమిలేములును సరులె!
ఉభయులకు హెచ్చులొచ్చు లేమున్న దింక?
మనసు మౌర్ఖ్యంబు నెనసి క్రమ్మఁబడుగాక! ౯౨

సీ. మాల మాదిగలకు మన కున్నయట్టులే
కలదు సుఁడీ బుద్ధి; కలదు తెలివి
ఆశలెల్లను గల వాసక్తి కలదు ఉ
త్సాహశక్తియును దీక్షయును గలవు

కల దోర్పు నభివృద్ధి కాంక్షించు సద్గుణో
త్కర మెల్లఁ దక్కువగాక కలవు
కలిగియు ఫలములేక నశించుచున్నవి
మన మంతరాయముల్ పెనుచుకతన

తే. వారలును వృద్ధి నొందంగ వలయునన్న
భగవదుద్దేశ్యమును గూడ భంగమయ్యె
భారతాభ్యుదయమున కపారమైన
భంగము ఘటిల్లె మనస్వార్థపరతకతన. ౯౩

సీ. భక్తి ప్రపత్తుల భాసిల్లఁగల రంచు
నమ్మింప మాల వైష్ణవులు సాక్షి!
శౌర్యత్రికాది చాతుర్య ధుర్యులఁటంచుఁ
బ్రకటింప మాలనాటకులుసాక్షి!
జవ సత్వ ధైర్యాతిశౌర్యాంకు లని చాటి
చెప్పంగ మాల మాష్టీంద్రుసాక్షి!
కరకౌశలాది శ్రీకర గుణాఢ్యు లఁటంచు
వాదింప మాల శిల్పకులుసాక్షి!

తే. సకల సుమనోవినోదన చర్యలందు
వలఁతులన మాల దేవరవాంద్రు సాక్షి!
బహుళతర రాజ్యకార్య నిర్వహణశక్తి
శాలులన మాలయుద్యోగిజనము సాక్షి! ౯౪

ఉ. పోలిన చాకచక్యమున భూముల శిస్తు వసూలు చేయుచున్
గ్రాలుచు నుండిరేకద! మరాట ధరిత్రిఁ; ద్రిలింగధాత్రిఁ బూ
ర్వాలురు గూర్చినట్టి ధనరాసులు కోశముఁ జేర్తురే కదా!
మాలల యోగ్యతన్ దెలుప మానితవృత్తము లివ్వి చాలవే! ౯౫

సీ. ఎందఱు కపిల మునీంద్రు లీమాలల
యం దుద్భవించి పెంపొందువారో?

ఎందఱు నందనరేంద్రు లీపంచము
　　లందు జన్మించి చెన్నొందువారొ?
ఎందఱు కనకకవీంద్రు లీమాతంగు
　　లం దుదయించి సొంపొందువారొ?
ఎందఱు శ్రీపాణిచంద్రు లీగోసంగు
　　లందు జనించి చెల్వొందువారొ?
తే. ఎందఱెందఱ రుంధతు లీనిషాదు
లం దవతరించి సత్కీర్తి నొందువారొ?
ఏపుగ నసీక మాలల హిందుజాతి
స్వార్థరతి నాత్మనాశంబు సలుపుకొనియె. ౬౧

ఉ. ఆరయ హిందుదేశమున నైదవభాగము నిమ్నజాతు లు
న్నారు గదా! నిరంతరము నైచ్యపుభావముతోడఁ జూచినన్
వారలు వైరమూని మనపైని; మతాంతరులై, ద్విధాత్వ మే
పారఁజరించినన్ మరల భారతవర్షము వృద్ధిఁ జెందునే! ౬౨

ఆ. సర్వ భారతీయ జాతీయతావిని
ర్మాణమునకు యవన క్రైస్తవులయు
స్నేహ మవసరమని చెప్పుచుండియు హిందు
జాతిఁ జీల్చివేయు నీతియగునె? ౬౩

సీ. నరుని శరీరంబునకును మస్తిష్కమెం
　　తటి యగత్యంబొ పాదములునంతె!
మెదడు లోపించిన మొదలె జ్ఞానము లేదు!
　　పదములు లేకున్న మెదలరాదు!
సంఘంబునకు నగ్రజాతి ముఖ్యతయెంతొ
　　కడపటి జాతి యక్కఱయు నంతె!
అంగంబులకు రక్తమాధారమెట్టులో
　　జాతులకెల్లను జ్ఞానమట్లె!

ఆ. సంఘదేహమెల్లఁ జక్కఁగా లేకున్న
సంఘమంత కార్తి సంఘటిల్లుఁ
గాన జాతులెల్ల జ్ఞానంబు నొందక
ముక్తిలేదు సంఘమునకు నిజము! ౯౯

ఉ. గోవులయందు హిందువులకుం గల భక్తియు, మ్లేచ్ఛక్రైస్తవుల్
గోవధఁజేసి మాంసమును గోరి భుజించుట తెల్లమే కదా!
కేవల పాపచిత్తులని క్రించుఁదనంబు వహించి మాలలం
గ్రేవలఁ జేరనీక యుడికించిన వారలు తన్మతస్థులై
గోవులఁ జంపి మాంసమును గొంకక జంకక మెక్కుచుంటచే
గోవధ నాఁడునాఁటికినిఁ గోట్లకొలందిని వృద్ధిఁ జెందె; హా!
గోవులయందు భక్తిగల కోవిదులైనను మాలవారలన్
బావులగాఁ దలంప కతి పావన భావులఁజేసి ప్రోవరే! ౧౦౦

చ. జగమునఁ దోడి జాతులటు సర్వవిధంబుల వృద్ధినొందుచున్
సొగసుల దొంతులై మిగుల శోభిలుచుండఁగఁ దేజుదక్కి యీ
వగ మనజాతి యార్తివడి వాసి దొఱంగుటకున్ గతం బిటుల్
పగగొని మాలలన్ బఱచు పాపఫలంబునకన్న నున్నదే! ౧౦౧

ఉ. తాలిమితోడ నీశ్వరుని దర్శనమున్ బొనరించు పొంటె పాం
చాలమునందు సూనరుల సంజ్ఞను నొప్పెడు మాలజాతి దే
వాలయమున్ జొరంగఁ దగుయత్నము సేయుటెఱింగి యగ్రవ
ర్ణాలెదిరించి నిల్చినఁ, బరస్పరవైరము హెచ్చి కోర్టులన్
వేలకొలంది విత్తమును వెచ్చము సేయుచుఁ బోరిపన్ జయ
శ్రీ లభియింపకున్కిఁ గడు సిగ్గిలి బెగ్గిలి యేమిచేయఁగాఁ
జాలక, హిందుజాతియెడఁ జాల నసహ్యము నొంది, యెంతయున్
జాలినిఁ జెంది, సూనరులు స్వామిక, సాంఘిక, గౌరవ స్వతం
త్రాలను గోలుపోయి సుతరామును సౌఖ్యము లేని జీవనం
బేల యటంచు రోసి, తమ బేలతనంబును మూలఁద్రోసి, పం
తాలు దలిర్పఁగా యవన ధర్మముఁ గైకొని, యొక్కమాటుగాఁ
జీలుకపోయి మక్కలను జేరిరి నూర్లకొలంది మంది, పాం

చాలమునందె మేఘులను జాతికిఁజేరిన మాలలెక్కడన్
గ్రోలఁగఁ బ్రాణముల్ నిలుప గ్రుక్కెఁడు నీళ్లను జిక్కకొక్కడన్
మేలగు బావిలోపలను మ్లేచ్ఛులు హిందువులందు సర్వ వ
ర్ణాల మనుష్యులున్ గలసి బ్రాహ్మణ శూద్ర విభేద భావమున్
గాలికిఁ దోలి మౌఢ్యమును గాలిచి పేలిచిరేమొ యన్నటుల్
మాలిమితోడఁ దోఁచుచు జలంబులు చేకొనుచుండఁ జూచి మే
ల్మేలని మెచ్చుకొంచుఁ జని మేఘులు తామునుగూడ బావిలో
నీళులు చేసుకోఁదలఁచి, నెయ్యము మీఱఁగఁ జేరరాఁగ; గ
గ్గోలు జనించి యెల్లరును గోల యొనర్చుచు నక్కటక్కటా!
కాలము కాలిపోయినది, కానితలంపులు పుట్టుచుండెఁ, బోఁ
గాలము వచ్చె మేఘులకు, గర్వము హెచ్చెను, కండ క్రొవ్వునన్
బాలికి వచ్చి రూపమును మైలయొనర్చిరి; యింతఘోర మే
కాలమునందునున్ గలదె? కార్యము లేదిఁక, వర్ణ ధర్మముల్
పాలన చేసికోఁగలుగు పాటి యుపాయము లేదు, నీమముల్
తూలక నిల్వవింక, ద్విజాలున్ గులధర్మములన్ గణింప; రా
శీలము మాఱిపోయినది, చెల్లెను న్యాయము, నీతిలేదు, దా
ష్ట్యాలకు మేర లేదు, నలుసంతయుఁ బాపఁపు భీతిలేదు; హా!
కూలెను వేదధర్మమని కొందఱు కుయ్యిడుచుండ, నాలుకల్
గ్రోలుచుఁ గోపతాపములఁ గొందఱు శాపము లిచ్చుచుండఁ, గ
య్యాలకుఁ గాలుదువ్వుచు, గయాళితనంబున బాలపైదిరుల్
రాలను రువ్వుచున్, మిగులరాయిడి సేయఁగఁ, దక్కువారలున్
గోలలు బూని క్రౌర్యమునఁ గొట్టుచుఁ దిట్టుచు వెంటనంటఁగాఁ
బోలదు పోల దన్న యొక పుణ్యుఁడు సైతము లేక, దీనులై
కాలికొలందిఁ బర్వలిడి, గ్రక్కున నిండ్లను జేరి యింక సే

వీలున హైందవ ప్రజలు పెట్టెడు బాధలనుండి తప్పు కోఁ
జాలుదు మంచుఁ జాలఁగ విచారణచేసి, యుపాయ మెంచియున్,
వేలకొలంది మేషు లోకపెట్టున మ్లేచ్ఛమతంబుఁ జొచ్చి ధీ
శాలులు బ్రాహ్మణాది జనసంఘము తెప్పునఁ దెల్లఁబోవఁ జూ
ట్టాలయి, మిత్రులై తగు పఠానులు సాయమువచ్చి నిల్వ, ను
ద్వేల ముదబ్ధిలో మునిఁగి తేలుచు, వేడ్కల నోలలాడుచున్
గాలము పుచ్చుచుండిరి సుఖంబుగ; మేషులు మ్లేచ్ఛులైనఁ గ
ల్లోలము లేదు కూపములలోని జలంబులు దోడువేళ; బం
గాళమునందు గోవధలు కారణముల్ గను మ్లేచ్ఛభారతీ
యాళికి సంభవించు కలహంబులలోపల నామశూద్రు లే
పాళికిఁ జేరకుండ నిరుపక్షములన్ బయినుండి చూచుచున్
దాళము వేయుచుండిరిగదా! శ్వపచుల్ గద వారలెల్ల! నీ
షోలిక వారితో మనము మూఢవివాదలు పెంచుకొన్నచో
వ్రీలదె హిందుజాతి? యతివేలపు సాంఘిక విప్లవంబునన్
గూలదె హిందుదేశ? మిదికూడునె! తోడి జనంబు నవ్వఁగాఁ
బాలయి పోరె హిందువులు? పాపపు నాశన దేవతాముఖ
క్ష్వేళకరాళకీలలకుఁ జిక్కి నశింపదె హిందుధర్మ? మిం
కేల విలంబముల్; తగిన కీలకముల్ గనిపెట్టి చక్కఁగా
మాలల సంస్కరించి తను మన్ననచేయుచు దేశ కాల పా
త్రాలను జూచి సద్విజవతంసులు గర్వముఁ దక్కి, సభ్యదే
శాల మనీషులంబలె విశాలములౌ హృదయాలతోడుతన్
వ్రాలుచు, "నెన్నివర్ణములు గల్గిన హైందవులెల్ల నొక్క టే
మేలగు జాతి" యంచుఁ దమి మీఱఁగఁ జాటుచు హిందుదేశ ధ
ర్మాలను నుద్ధరింపరె? సమస్త విఘంబులఁ గీర్తి నింపరే? ౧౦౩

తే. క్రైస్తవ మహమ్మదీయ ధర్మంబులందుఁ
గలియు వారందఱును నీచకులమువారె
సాంఘిక స్వామ్య గౌరవాసక్తిఁ గాక
తారతమ్యం బెఱిఁగి చేరువారె వారు? ౧౦౩

గీ. వంగదేశీయు లిప్పు డీభంగపాటుఁ
గాంచి పంచములను గారవించుచున్న
వారు; మరియు, మహారాష్ట్ర ప్రజలుఁగూడ
యుక్తరీతినిఁ బ్రేమించు చున్నవారు. ౧౦౪

ఉ. మాలకులంబు కన్నఁ గసుమాలము గల్గిన జాతులెన్నొ వై
మాలముగాఁగ నున్నను, సమస్త జనంబులు మాలవారినే
తేలిక చూపు చూడఁ గలదే తగు కారణమేది యైన? నే
కాలమునందొ మాలలకుఁ గల్గెను నీచత; నాఁటినుండియున్
జాలుగ వచ్చుచున్న యది చాలశకంబులనుండి, యెవ్వ రీ
జోలికి రారు, సత్యమును జూడఁదలంచిన యెవ్వరైన నీ
"మాలల కెట్టు లేర్పడియె మైల"! యటంచును బ్రశ్నసేయ, మా
మూలుగ వచ్చుచున్న దని మూల్గుట మాత్రమెకాని, యిట్టి దీ
మాలలయందు లోపమని, మాలలుచేసిన పాపమంచు, నీ
మూలముచేత మాలలను ముట్టఁగరా దనువారులేరు ; ఈ
వేళను మాలవారికినిఁ బెక్కులు హీనకులాల వారి కే
లీలఁ బరీక్షచేసినను లేశము భేదముకద్దె? యింతకున్
మాలలనేచఁగాఁ బ్రజల మౌఢ్యమె హేతువుగాఁగఁదోఁచు ; నిం
తేల నెటాలుదేశమునఁ దెల్లని వారికి నల్లవారిపై
ప్రీలకయున్న యీర్ష్యయును ద్వేషపుబుద్ధియు లేదు గాన, నీ
మాలలవల్ల దోష మణుమాత్రము లేదని బోధ చేసినన్

వేలము వెట్టిగాఁ బ్రజలు నేఁపక తక్కిన నిమ్న జాతులన్
మాలిమిఁ జూచినట్లయిన మానక చూతురు కాన, సద్ద్విజుల్
మాలల పుట్టుపూర్వములు, మాలలు నీచతఁగన్న హేతువుల్,
మూలము ముట్టగాఁ బ్రజకు బోధయొనర్పరె? మేలుఁ గూర్పరే? ౧౦౫

ఉ. పామరులైన హిందువులు వందలువేలును నన్యధర్మమున్
దాము గ్రహించుచుండుటకుఁ దత్కులమున్ మన యగ్రవర్ణముల్
వేమరు నీచభావమున వేసరఁజేయుట హేతువై ననున్
దానుసవృత్తిమై బరమతస్థులు హిందుమతంబుమీఁదటన్
దీమసమొప్ప మోపు నపనిందలు సాయములౌనుగాన ను
ద్దామయశంబుగన్న స్వమతంబు మహత్వము చాటి చెప్పి బో
ధామృతవృష్టి లోకమును దన్పి విమూఢుల సంశయంబులన్
శ్రీమహితాత్ములై తొలఁగఁ జేయరె? సత్యమెఱుంగఁజేయరే? ౧౦౬

ఉ. జ్ఞానవిహీనతన్ శ్వపచ జాతుల కీదురవస్థ కల్గె సు
జ్ఞానధనంబు విద్దియ యొసంగును కావున విద్య నేర్పినన్
మానవధర్మముల్ దెలిసి మానుగ వర్తిలి యీమతంగజుల్
మానవులై చరింతు రభిమానము మానము జ్ఞాన మేర్పడన్. ౧౦౭

గీ. ఈయుపాయంబుఁ దలఁచి దేశీయులందు
సంఘభక్తులు, సంఘ సంస్కారపరులు
మాలలకు జ్ఞాననేత్రంబు మమత నొసఁగ
జతనములు సేయుచున్నారు శక్తికొలఁది. ౧౦౮

గీ. పంచముల దుస్థితినిఁగాంచి పరితపించి
వారి దీనతఁ బాపఁగాఁ గోరియున్న
సజ్జనుల సత్కృపను పాఠశాల లెన్నొ
వెలసినవి; యొల్లెడల నింక వెలయఁ గలవు. ౧౦౯

గీ. ఇతర దేశీయు లగు క్రీస్తుమతమువారె
మాలల యభాగ్యతకుఁ జాల జాలిఁ జెంది
వారి బాగునకై శ్రమంపడుచునుండ
మన ముపేక్షవహించుట మంచిదగునె? ౧౦౯

చ. అరయఁగ వంగదేశమునయందు వసించెడు నామశూద్రులి
తరగతిలోనివార లెకదా! మనసంఘమువారు వారి నా
దరణము సేయకుండిన కతంబున నేకద! వేన వేలుగాఁ
దురకలఁ జేరి హిందువుల దూఱుచు నుండిరి మేలు మీఱుచున్. ౧౧౦

క. మలకలలోపలఁ గొందఱు
కలసిరి హిందువులు మఱియుఁ గ్రైస్తవులందున్
గలసి రిఁకఁ గలయుచుండిరి
వెలివేయుచు మన మగౌరవించుటవలనన్. ౧౧౧

చ. ఇతర మతంబులందు మన హిందువులందఱు చేరుచుంట యా
మతములలోన నుండు పరమార్థ మెఱింగియె కాదు సుండి! ఈ
మతమున నెట్టిలోప మణుమాత్రము కద్దని కాదు సుండి! స
మ్మతముగ వార లందఱి సమానముగాఁ గనుచుంట; హిందువుల్
హితమతిఁ జూడకుంటయును హేతువు లింత యథార్థ మెంతయున్. ౧౧౨

ఉ. పరువుగ నెల్లవారి సమభావమునన్ మన మాదరింపమిన్
దఱచుగఁ బామరుల్ పరమతంబులలోపలఁ జేరుచుండి రీ
కరణినిఁ గోట్లకొద్ది ప్రజ క్రన్నన నన్యులఁ జేరి పోయినన్
హరహర! దుస్సహంబగుచు హైందవసంఘము రూపుమాయదే? ౧౧౩

సీ. సర్వ సమత్వంబుఁ జాటుటచేఁగదా
క్రైస్తవ మత మెల్లకడల నిండె!
సర్వ సమత్వంబుఁ జాటుటచేఁగదా
బౌద్ధధర్మము జగద్వ్యాప్తమయ్యె!

సర్వ సమత్వంబుఁ జాటుటచేఁగదా
ఇస్లాము మత మెల్లయెడల వెలసె!
సర్వ సమత్వంబుఁ జాటమిచేఁగదా
హిందూమతంబు నశించుచుండె!

తే. ధర్మమణియైన హిందూమతంబునందు
సర్వమంగళ మయ్యెనే సర్వసమత ?
లేదు! లే! దది లేక పోలేదు! గాని
ఆచరణలేక "ఉండి లేనట్టి" యయ్యె. ౧౧౪

సీ. మన మెంత మాలల నణఁగఁద్రొక్కిన వార
లౌన్నత్యమును బొందుచున్నవారు
దైవ సత్కృపను విద్యాభ్యాసమును జేసి
యుద్యోగములు చేయుచున్నవారు
జ్ఞానంబు వడసి నాగరకత్వమున మించి
యురుశుచిత్వము నొందుచున్నవారు
పరమతంబులఁ జేరి సరుల ప్రాపుననుండి
సన్నుతులను జెందుచున్నవారు

తే. వారి కొక్కింత యధికారపదవి వచ్చె
నన్నఁ దలమీఁదివేల్పు లౌచున్నవారు
వారి నిప్పుడేని మనలోనఁ జేరనీయ
నొప్పకున్న దేశమునకు ముప్పురాదె? ౧౧౫

సీ. ఆర్య సామాజికు లతిదయాదృష్టి నం
త్యజులఁ బ్రోవఁగ దీక్షఁ దాల్చినారు
బ్రహ్మసామాజికుల్ ప్రబలానురాగులై
వారిపైఁ దమ చూడ్కిఁ బఱపినారు
సమత దివ్యజ్ఞాన సామాజికులుఁగూడ
వారిఁ గాచెడు కోర్కి మీఱినారు

రామకృష్ణ వివేక సామాజికులు సదా
వారి యభ్యుదయంబె కోరినారు

గీ. అల బరోడా మహారాజ తిలకు వంటి
స్వపరిపాలితసంస్థాన సత్ప్రభువులు
పీఠపురి సూర్యరాయాది పృథివి పతులు
వారి రక్షించుదారినే చేరినారు. ౧౧౬

మ. కలయన్ జూచిన నెంచు జన్మములను దుంగల్ గాని బల్ చెట్లుఁ, బు
ట్టలునుం, గుట్టలు, గట్లు, మిట్టలును జూడన్ రాని కొల్లేటి భూ
ములలో దోమలబాధఁ బొంపుకొను నేర్పుల్లేక ఘోరార్తిమై
నిలువన్ జాలని నోరులేని పసులన్ వీక్షించి డెందంబు వి
హ్వలమై నిల్వన నీరుగాఁ గరఁగి హా! హా! యంచు నిట్టూర్చి య
గ్గలపుం జాలినిఁ జెంది తత్పశులకున్ గండాతివారించి యె
వ్వలనన్ సౌఖ్యముఁ గూర్పఁ బెక్కు శిలలన్ బాతించి పుణ్యాత్ములన్
బలుపుణ్యాత్ముఁ డటన్న కీర్తిఁ గనె నెవ్వాఁ డాన్నృసింహాప్పరా
యలు జన్మించిన యాంధ్రదేశమునఁ గట్టా! యట్టి కారుణ్యమూ
ర్తులు, ధర్మాత్ముల్, లుదార సాహసులు, ధీరుల్, కార్యశూరుల్, మహో
జ్జ్వలకీర్తుల్, సుచరిత్రు లెవ్వరయినన్ జన్మించి, యిమ్మందభా
గ్యుల, నీమాలల నుద్ధరించి, కృతకృత్యుల్గాఁ బ్రకాశింపరే? ౧౧౭

సీ. మన ప్రభుత్వంబువా రనుకూలురై పంచ
ముల నుద్ధరింపఁగాఁ దలఁచినారు
పంచమజాతికి బ్రహ్మజాతికిఁ గూడ
శాసనా లొకరీతిఁ జేసినారు
మాలల బడుల కిమ్మడిగా ధనం బిచ్చి
ప్రోత్సాహమును జేయుచున్నవారు
అందఱితోడ న్యాయస్థానముల యందు
నన్ని స్వత్వము లిచ్చియున్నవారు

తే. సరి సమానంబుగా నెల్లజాతులకును
బన్ను బందులు విధియించుచున్నవారు
ధూమశకటాదులను లోపమేమి లేక
యెల్లరికి నొక్క యధికార మిచ్చినారు. ౧౧౭

సీ. మనుపరే! యీదిక్కుమాలిన మాలలఁ
గరుణాంతరంగులై క్రాలుఁవారు
పెనుపరే! యీనిరుపేద మాతంగుల
దీన బాంధవదీక్షఁ బూనువారు
కావరే! యీకనికరపు బానిసలను
బరమ ధర్మాత్ములై పరగువారు
ప్రోవరే! యీతేళ్ళఁబోని మానిసులను
బుణ్యచారిత్రులై పొలుచువారు
గీ. ఆదరింపరె! యీశునిఖాదినులను
సతత లోకోపకారులై బ్రతుకువారు
దాపుఁజేర్పరె! యీ చిరదాస్యయుతుల
నార్త రక్షణ శీలురై యలరువారు. ౧౧౮

తే. నిమ్న జాత్యుద్ధరణ మన్న నీచజాతి
జనులకును జ్ఞానధనమిచ్చి జడతమాన్చి
మౌఢ్యమును మడ్డితనమును మాయఁజేసి
హైందవులకెల్ల సభ్యత నలరఁజేసి
ప్రజలలో భ్రాతృభావంబుఁ బాదుకొలిపి
భారతకుటుంబమున కాత్మబలముఁజేర్చి
యేకజాతీయతాభావ మెలయఁజేసి
తోడి మతములలోన హిందూమతంబు
నఖిల జాతులలోపల నార్యజాతి

గౌరవంబును సత్కీర్తి పేరుఁగాంచి
యభ్యుదయ మొందఁజేయు నుద్యమముగాని
సకల కులములు గలిపెడు చర్యగాదు. ౧౨౦

సీ. పంచమాదుల నుద్ధరించు ప్రయత్నంబు
జల్లిమాటలనెల్ల జరుగఁబోదు!
ఉచితమై తగునట్టి యుత్తమ విద్యతోఁ
జర్మకారక పరిశ్రమము నేర్పి
తెలుఁగు సీమల నెల్లెడలఁ జర్మసామగ్రి
నిర్మించు శాలలు నిలుపవలయు!
నిలిపి చర్మపు వస్తువులు సిద్ధపరిపించి
యన్యదేశ్య ప్రవాహ మాపవలయు!
తే. ఈవలయు మాలలకు సౌఖ్య జీవనంబు;
నధికధనమూల మీకార్య మగుటకతన
నాంధ్రసూర్యునివంటి యౌదార్య ధుర్యు
లీ మహోద్యమమున కూత మియ్యవలయు! ౧౨౧

సీ. నుడువలేదు సుమండి! కడజాతివారింట
భోజనంబులు సేయఁ బోలు ననుచు
పలుకలేదు సుమండి! పంచమజాతితో
స్నేహంబు లేప్రొద్దు సేయుఁ డనుచు
చెప్పలేదు సుమండి! చేరి మాలలతోడఁ
బొందుగా వియ్యంబు లందుఁ డనుచు
ఆడలేదు సుమండి! యంత్య వర్ణజులను
విందు వేడ్కలకు రావింపుఁ డనుచు
తే. ఆర్యవరులార! సహభోజనాదికములు
సహజ సద్భావ సంపద సమముగావు!

ఐకమత్యంబు సమకూర్చి యలరఁజేయ
సానుభూతియె యన్నింటిసరి సుమండి! ౧౨౨

సీ. అన్ని జాతులకు విద్యాదానమును జేసి
జ్ఞాన సంపదఁ బెంపఁ బూనరయ్యా!
ఎన్ని కులములున్న హిందువు లందఱు
నేకజాతి యటంచు నెంచుఁడయ్యా!
నీచ వంశజు లెల్ల శౌచ, మారోగ్యంబుఁ
బెందు సాధనములు జేయరయ్యా
ఆపన్ను లై యున్న యంత్యజన్ములకైనఁ
దోడు పాటొనరింపఁ జూడరయ్యా!
తే. ఆర్య లేగిన దారుల నరయరయ్యా!
ఉన్నతాదర్శమున దృష్టి యుంచరయ్యా!
మనసులో భేదభావముల్ మరువరయ్యా!
హిందు జాతినిఁ బునరుద్ధరింపరయ్యా! ౧౨౩

ఉ. మాలల భావికాలదశ మాన్యతరంబు,మహోన్నతంబు నై
క్రాలెడు; నిందు సందియముఁ గాంచఁగ నక్కఱ లేదు, దైవ మీ
లీలఁ బరీక్ష సేయుచుఁ జలింపక యోర్చుచుఁ దన్ను గొల్చు సం
శీలుర నుద్ధరించు నని చెప్పవొకో మన వేదశాస్త్రముల్ ! ౧౨౪

గీ. మనము మాటను దక్కించుకొనకయున్నఁ
గార్య మాఁగదు, కాలమే గడవఁ జేయు
దేవుఁడే సాయమును జేయు దీనతతికిఁ
జేరి తోడ్పడరయ్యా! దేశీయులార! ౧౨౫

# ప్రార్థన.

ఉ. మాలల గోల భాగవతమా, మరి భారతమా, వినంగ; మా
కాలము వోవుటే ఫలము కాకిఁక పుణ్యము! పూరుషార్థమా;
“మాల లటంచుఁ బేర్కొనిన మాత్రనె పాపమువచ్చు”నంచుఁ బ్రా
ల్మాలక, మీర లీబయిసిమాలిన దీనుల నాలకింపుఁడీ!

# నిరుద్ధభారతము

---

సీ. సరస దయా సత్య శౌచ సంపదలొప్ప
వర్తించు భూసురస్వాములార!
ఘనమైన దేశపాలనశీలమున మించి
పరగెడి క్షత్రియప్రభువులార!
భాగ్యభోగ్యంబు లొప్పఁగ దానకర్తలై
తనరారు వైశ్యరత్నములార!
కాయకష్టమున దేశియవృద్ధికి ధన
ద్రవ్యముల్ గూర్చు శూద్రవరులార!
గీ. దీనజనులము; మేము మీ దేశజులము;
ఆదివారము మీకు; మీ సోదరులము;
పతితులైనాము; మాదు దుర్గతిఁ దొలంచి,
జ్ఞానధనమిచ్చి మముఁ బ్రోవఁ బూనరయ్య! ౧

సీ. రాజ్యాంగ తంత్రజ్ఞ రాజి మెచ్చఁగ ధరా
రాజ్య మేలిన మహారాజులకును
జ్ఞానప్రదాయక గ్రంథకోటినిఁ గూర్చి
సత్కీర్తి వడసిన సత్కవులకు
విజితేంద్రియత నొప్పి వీతరాగత మోక్ష
మార్గ దర్శకులైన మౌనులకును
సకల జీవన సౌఖ్య సాధనంబులు జూపు
లోకజ్ఞు లగునట్టి లౌకికులకుఁ

తే. దావలంబైన మావంశ మీవిధానఁ
గేవలంబైన దుస్థితిఁ గీడ్వఁబడెంగ
నావిలంబయ్యె మా మదు; లేవపడక
క్రేవలంజేర్చి, సత్కృపఁ బ్రోవరయ్య! ౨

సీ. కుక్కలకంటెఁ దక్కువవార మైతిమా!
మమ్ము మీ వాడల మసలనీరు
కాకులకంటెఁ జులకనివార మైతిమా!
మమ్ము మీదవ్వుల మసలనీరు
పిల్లులకంటెఁ బాపిష్ఠుల మైతిమా!
మమ్ము మీయిండ్లలో మసలనీరు
దున్నలకంటె నెంతో నీచ మైతిమా!
మమ్ము మీ వాకిండ్ల మసలనీరు

తే. లేళ్ళకంటెను గోళ్ళ పాట్టేళ్ళ కంటె
మీకుఁ గొఱగాక పోతిమా! తాకనీరు
సుగుణమణులార! న్యాయంబుఁ జూడరయ్య!
మేము మీ సోదరులము మమ్మోమరయ్య! 3

సీ. ఇలువీడి పయనంబు లేసుదెంచెడివేళ
నెదుర నేరికిఁ గారసిల్లరాదు
నాటకంబులు, సభల్, సఖ్యవినోదముల్
వేడుకతోఁ జూడ నెళ్లరాదు
పర్వవేళలనైన భక్తితో దేవతా
దర్శనంబును జేయఁ దలఁపరాదు
పదిమంది నడచెడు బాటగదా యంచు
నడువీథిలో నైన నడువరాదు

ఆ. ఊరివారితోడ నీరాటరేవుల
స్నాన మాడరాదు, జలముఁ గొనఁగ

రాదు, మాట లాడరాదు శిష్టులతోడ;
మేము చేయు పాప మేమిటయ్య! ౪

సీ. శుచిలేదనుచు మమ్ముఁ జూడరాదందురా
పరిశుభ్రతను మాకుఁ గఱపరాదె!
పరమమూర్ఖులు మీరు పనికిరారందురా
తెలివితేటలు మాకుఁ దెలుపరాదె
సద్గుణంబుల మీరు సాటిరారందురా
మహిత బుద్ధులు మాకు మప్పరాదె!
కరము నీచులు మీరు కలయరాదందురా
నెఱతనంబును మాకు నేర్పరాదె!
తే. అతి దరిద్రులగుట నోతు మందురేని
సిరి గలుగు మార్గములు మాకుఁ జెప్పరాదె!
భూతదయ యుంచి, పటు సానుభూతి మించి
శ్రేయములు గూర్పరయ్య! దేశీయులార! ౫

సీ. త్రాగుబోతు లటంచుఁ దప్పెంచఁబోదురా
మద్యపాయు లిఁకెంతమంది లేరు!
గొడ్డుమాంసము దనే మడ్డివా రందురా
మాంసభక్షకు లెంతమంది లేరు!
నీమంబు లెఱుఁగని నీచుల మందురా
మాపంటివా రెంతమంది లేరు!
నిత్యసేవకులంచు నిరసింతు మందురా
మందభాగ్యు లిఁకెంతమంది లేరు!
తే. ఉచితరీతిని భాషించు నొప్పిదంబు
లేనివారని మన్నింపరేని, యితర
మనుజులం దట్టివా రెంతమంది లేరు!
మమ్ము జుల్కనజేయ మూలమ్ము గలదె! ౬

సీ. మము మీరు వెలివేసి మన్నింప కుంటచే
నూరిబైటను మేము చేరవలసె
పరిశుద్ధతను మాకుఁ గఱపకుండుటచేత
మాలిన్యమున మున్గి తేలవలసె
చదువు చెప్పక మమ్ము వదలివేయుటవల్ల
నజ్ఞానరూపమం దణఁగవలసె
నీతు లేమియు మాకు నేర్పకుండుటచేత
దుర్నీతిలోఁ బడి దొర్లవలసె
తే. మన మతంబునఁ గల ధర్మ మర్మములను
జెప్పనికతాన నన్యులఁ జేరవలసె
కలసి చేఁదోడు వాఁదోడుగా మెలంగు
మమ్మిట్టు లుపేక్ష సేయ నేమమ్ముగలదె! ౭

సీ. మడ్డివారని కన్నబిడ్డల నెందేని
ప్రేమింపకుందురే వెఱ్ఱులేని?
క్రూరచిత్తులటంచుఁ గొడుకుల దయమాని
పోషింపకుందురే మూర్ఖులేని?
అప్రయోజకులంచు నాత్మసంతానంబు
విడనాడఁజూతురే వెడఁగులేని?
జ్ఞానశూన్యులటంచు సూనులఁ బగఁబట్టి
తెగనాడఁజూతురే మూఢులేని?
తే. ఎట్టిలోపంబు లెన్ని చూపట్టుచున్నఁ
దలఁపక సహించి పరమశాంతము వహించి
కన్నబిడ్డలవలె నెంచి కరుణ నించి
మమ్ము మన్నించి పెంచరే! మాన్యులార! ౮

సీ. చదువు గల్గినఁ గదా! సదసద్వివేకంబు
తోఁ జాకచక్యంబు తొంగలించు

ధనము గల్గినఁ గదా! ఘనతర వ్యవహార
కౌశల్యమహిమంబు గానుపించు
శిక్షగల్గినఁ గదా! చిర సాంప్రదాయక
సద్వర్తన స్ఫూర్తి సంఘటిల్లు
సాము గల్గినఁగదా! శాత్రవోద్యద్దర్వ
నిర్వాపణ ఖ్యాతి నివ్వటిల్లు

తే. మాకు చదువీక, ధనమీక, మంచి శిక్ష,
సాముఁ, గఱపక; పామరుల్, సోమరులని
మందులని, పందలని మమ్ము నిందచేయ
నేమిఫల మున్నదయ్య! మాస్వాములార! ౯

సీ. మారిషస్దీవిలో మర్యాదచేయక
యలుసు చేసినయంత నల్పులైరె?
సౌతాఫ్రికాలోన సమముగాఁ జూడక
నిరసించినంతనే నీచులైరె?
కనడా ధరిత్రిలో గౌరవింపక యవ
మానించి నంతనే హీనులైరె?
అమెరికా సీమలో నాదరింపక చిన్న
మాపు మాచిన మాత్రఁ బాపులైరె?

తే. భారతీయులు; వారి కెవ్వారు సాటి?
నాగరకులందు భరతసంతానమెట్లొ
భరతవర్షీయులందు శ్వపాకులట్లె!
ద్వేషభావంబు మాని శోధింపరయ్య! ౧౦

సీ. పురములలోనఁ గాపురము లుండఁగనీక
నడిదారిలోపల నడువనీక
పదిమందితోఁ బాటు బడులకుఁ బోనీక
పొగబండ్లలోఁ జొత్తు పొందనీక

కృషికార్యముల స్వయంకృషి యొనర్పఁగనీక
వాణిజ్య లాభముల్ వడయనీక
నీచులవలె నెంచి, నిర్దయత్వము మించి,
నానాగతుల నవమానపరచి
తే. మిమ్ము మమ్మును నొక్కచందమ్ముఁజేసి
కష్టపెట్టిన సౌతాఫ్రికనుల నెల్ల
దుర్నయులటన్న మీరలే వర్ణభేద
మూలమున మమ్ము హింసింపఁబోలునయ్య! ౧౧

సీ. పరమభక్తిని మీరు పఠియించు శ్రీరామ
నామమంత్రమునె యెన్నఁడు బఠించి
మరియాదగా మీరు ధరియించునట్టి చం
దమునె యెపుడు వస్త్రములు దాల్చి
సుతిమీఱ మీరు గైకొనునట్టి శ్రీమణి
శ్రీచూర్ణములె ఫాలసీమఁ జేర్చి
అతిశయంబుగ మీర లాదరించెడునట్టి
సరణినే కేశపాశములు దాల్చి
తే. మీదు హిందూమతంబునే మిగులనమ్మి
తవిలి ముప్పదిముక్కోటి దైవతముల
సేవచేసెడు మమ్మిట్లు చేరకుండఁ
గొట్టుటిది ధర్మమే! ఆర్యకులజులార! ౧౨

సీ. అగ్రవర్ణములవా రధికులంచుఁ దలంచి
యతివిధేయతఁ జూపినన్నినాళ్ళు
బ్రాహ్మణు లందఱుఁ బరమదైవములంచు
నతిభక్తితో మ్రొక్కినన్నినాళ్ళు
బ్రాహ్మణ పాదతీర్థము పావనంబని
యతిమోహమునఁ ద్రాగినన్నినాళ్ళు

ద్విజు లెల్లరును గొల్చు దేవతాకోటినే
యతిహర్షమునఁ గొల్చి నన్నివాళ్ళ

గీ. నవ్వులకుఁ దోలి; యన్యమతస్థులగుచు,
ద్విజుల, ద్విజదైవతంబుల ద్వేషబుద్ధి
గలిగి నిరసించునాఁడు పుల్కసుల నెల్ల
గౌరవించెద రిది యేమి గడుసుఁదనము? ౧౩

సీ. మాకు మీరు మతంబు మప్పకుండినను మీ
మతమె మా మతమంచు మదిని దలఁచి
వెలివేసి మీరెంత వెలువరించుచు నున్న
నశ్రాంతమును మిమ్మె యనుసరించి
అదయులై మమ్మెంత యణఁగఁద్రొక్కుచు నున్న
నుద్ధరించెదరంచు బుద్ధి నమ్మి
చదువీక దుస్సహాజ్ఞానాంధువందు ద్రో
సినను మా గురులంచు సేవచేసి

తే. మేము మిము వీడకున్నాము మేకలట్లు
కటికితనమున మిమ్మిట్లు గాసిబెట్ట
తగవుగా, దింక మాకు విద్యల నొసంగి
దయ యొసంగఁగఁ బ్రోవరే దాతలార! ౧౪

సీ. దూరదూరంబుగాఁ దొలఁగు చుండెడు వాఁడు
సరసఁ గూర్చుండంగ శక్తుఁడగును
మడివేళ స్మరియింపఁ బడరానివాఁడు హ
స్త స్పర్శమున కర్హతను వహించు
అవశంబుచే నైన నంటఁ గూడనివాఁడు
కలసి వర్తింప యోగ్యతను గాంచు
దర్శనంబున కైనఁ దగనట్టివాఁడు మి
త్రత్వంబునకును బాత్రతను దాల్చు

గీ. క్రైస్తవుం డైన మాత్రఁ బుల్కసకులుండు
మన మతంబున కటువంటి మహిమ లేదె?
దురిత చరితుల కెల్ల హిందూమతంబు
శరణ మిడ లేదనుట దుర్యశంబు గాదె! ౧౫

సీ. కాపురంబులు చేయఁగాఁ జుట్టుగుడిసెలే
కాని లోగిళ్ళు లెక్కకును లేవు
చెలఁగి కట్టంగ మాసిన చింపిగుడ్డలే
కాని వల్వలు కొంచెమైన లేవు
త్రావంగ నూకల జావయుఁ, గంజియే
కాని యన్నమును శాకములు లేవు
సొగసుగాఁ దాల్ప గాజులుఁ, బూసపేరులే
కాని బంగరునగల్ లేశ లేవు

గీ. పంట పండింపఁగా నూరివారిచేతె
కాని సొంతంబు లెందును గానరావు
అకట! మా ఘోర దారిద్ర్య మొకరికైన
జాలి పుట్టింప దాయెనా? శ్రీలులార! ౧౬

సీ. ఆఁకలి చిచ్చుచే నడలి చచ్చినఁ గాని
మాలల కొక యన్నశాల లేదు
నో రెండుకొనిపోయి దోరుచున్నను గాని
మాలల కొక పానశాల లేదు
ఘోరరోగములచేఁ గూలుచున్ననుగాని
మాలల కొక వైద్యశాల లేదు
అచ్చురాలను నేర్వ ముచ్చటైనను గాని
మాలల కొక పాఠశాల లేదు

గీ. దిక్కు మ్రొక్కును లేక మ్రందినను గాని
మాలలకు నొక్క రక్షణశాల లేదు

దానవీరులుగల హిందుధాత్రియందు!
ధర్మహానియో మాలకు ధర్మమిసుట! ౧౬

సీ. మా మడ్డితనము మా మాలిన్యమును జూచి
దయ రాదటయ్యా! సధర్ములార!
మా యవివేకత మా నీచతను జూడ
జాలి లేదాయెనా! సరసులార!
మా యిండ్లు వాకిండ్లు మాదరిద్రతఁ జూచ
హృదయంబు కరఁగదే! సదయులార!
మా వాలకంబులు మాదుస్థితినిఁ జూడఁ
గన్నీరు గారదే! యన్నలార!
గీ. మమ్ము మన్నించి యుద్ధరింపఁగను మీకు
బుద్ధి పుట్టక పోయెనే! పుణ్యులార!
మేము మీ సోదరులమన్న మేలిమాట
చిత్తమునఁ దోఁచలేదె! దేశీయులార! ౧౭

సీ. వాత్సల్యమున 'నాత్మవ త్సర్వభూతాని'
యను పల్కు మనమునం దరయరయ్యా!
ఆర్ధిఁ 'బరోపకా రార్థం శరీర' మన్
పలుకు మీ మదిలోన నిలుపరయ్యా!
కరుణమైఁ 'బాపాయ పరపీడన' మ్మను
నీతి డెందమునన్ గణింపరయ్యా!
సారిది 'సర్వే జనా స్సుఖినో భవం' తను
ధర్మంబు నెదలోనఁ దలఁపరయ్యా!
తే. మాపయిని సర్వసమతను జూపరయ్యా!
కూర్మి మెయి మాకు మేలొనఁ గూర్పరయ్యా!
మమ్ము బాములఁ బెట్టక మనుపరయ్యా!
మాకు సౌఖ్యంబు సమకూర్చి సాకరయ్యా! ౧౮

సీ. మోయకున్నది మిమ్ము మోయునట్టులు మమ్ము
భూమ క్షమకు దీవి భూమిదేవి
మీకు వెన్నెలఁ గాచి మాకుఁ గాయుటలేదె!
చలువల పరసీమ చందమామ
మీ మీఁదనే గాని మామీఁద వీవఁడే
సరస సౌరభశాలి చల్లగాలి
వెలుఁగు వేఁడియు మీకుఁ గలిగించి మా కీడె
భవ్య సౌఖ్యకరుండు భాస్కరుండు
తే. కురిసి మీపైని మాపైనిఁ గురియకున్నె?
సకల సస్యావన సుకీర్తి జలదమూర్తి
దైవదృష్టికిఁ బక్షపాతంబు లేదు
సృష్టి నీక్షించి తెలియరే! శిష్టులార! ౨౦

సీ. మీకుఁ బంటపొలాల మా కరణ్యములందు
నాహార వస్తువు లమరు నొక్కొ?
ఫల వృక్షములు రుచ్యఫలములు మీకిచ్చి
చేదుపండ్లను మాకుఁ జేర్చునొక్కొ?
నదులు శుద్ధంబైన యుదకంబు మీకిచ్చి
కసటు జలంబు మా కొసఁగు నొక్కొ?
మీకుఁ దియ్యనిపాలు మేకొల్పు గోవులు
వట్టినీళ్లను మాకు వదలునొక్కొ?
తే. వహ్ని మీశాకపాకముల్ పచనపరచి
మాకుఁ బచనంబు సేయక మానునొక్కొ?
సృష్టిలో లేని వలపక్ష మేల మీకు?
శిష్టజనులార! వేగ వర్జింపరయ్య! ౨౧

సీ. మామీఁద సోఁకి మీ మైమీఁద సోఁకదే!
గాలి కించుకయేని మైలగలదె!

మేము నిల్చినచోట మీరు నిల్చుటలేదె!
భూమి కొక్కింతేని మట్టుగలదె!
మేము చేకొనువెన్క మీరు చేకొనలేరె!
యానీటి కింతేని నంటు గలదె!
మేము ముట్టినదాని మీరు ముట్టుటలేదె!
యగ్గి కించుకయేని నెగ్గుగలదె!
తే. వాడరే మేమువాడిన బాస మీరు!
తాఁకరే మేము తాఁకిన ధనము మీరు!
విశదముగఁ జూడ వానికి నశుచి గలదె!
మాకు వెలి యెట్లు వచ్చెనో మాన్యులార! ౨౨

సీ. మీ తల్లిదండ్రులు మిమ్ముఁ గాంచినరీతి
మాతల్లిదండ్రులు మమ్ముఁ గనరె!
మీ మేనులందు మా మేనులవలె రక్త
పలలంబులే గాక పాలుగలవె!
కష్టసుఖాలు మీకాయంబులకె గాని
మాకాయముల కేమి లేకయున్నె!
సర్వేంద్రియంబులు సరిసమంబులుగాక
హెచ్చుగా బ్రహ్మ మీకిచ్చినాఁడె!
ఆ. ఒక్కటే కులంబు! నొక్కటే కుటుంబము!
నొక్కఁడె దేవుఁ! డాత్మ యొకటె పుణ్య
మొకటె! పాప మొకటె! యొకటె! పుట్టువు! మృత్యు
వొకటె! తెలియుఁ డెల్లరికిని ద్విజులఁ! ౨౩

సీ. పాఠశాలల మాల బాలకు లిరువంకఁ
గదియంగఁ గూర్చుండి చదువవచ్చు!
రైలులో, సంతలో, రహదారి పడవలో
మాలలఁ గలసి దిమ్మరఁగవచ్చు!

ఆసుపత్రులలోన, సంగళ్లలోన మా
తంగుల తీర్థంబు త్రాగవచ్చు!
క్రైస్తవ మతములోఁ గలసిన మాలఁ డు
ద్యోగియై రాఁగానె మ్రొక్కఁగవచ్చు!
తే. పంచములు తెచ్చి యిచ్చిన ఫలములైన
బ్రాహ్మణోత్తము లెల్ల సాపడఁగవచ్చు!
నీశ్వరునికైన నైవేద్య మిడఁగవచ్చు!
మాలలకు నిట్టివేళల మైలలేదె? ౨౮

సీ. పొగబండ్ల నోడలఁ బోవుచో నొకరీతి,
పడవల నెక్కునప్పు డొకరీతి,
నడిదారిలోపల నడచుచో నొకరీతి,
యొగిఁ దీర్థయాత్రలం దొక్కరీతి,
సంతల కేతెంచు సమయాల నొకరీతి,
యొనర బట్టణములం దొక్కరీతి,
పల్లెటూళ్లందున్న పట్టులం దొకరీతి,
యగ్రహారముల వేరైన రీతి,
తే. లౌకికోద్యోగవశులైన లాతిరీతి,
యిట్టి యాచార మింక నెందేని గలదె?
యక్కరనుబట్టి నీమమా? యక్కటకట!
చాలు చాదస్త మిఁక, ద్విజస్వాములార! ౨౯

సీ. పరమహర్షముతోడ భక్షించుచున్నారు
గద కాస్మపాలిటన్ క్లబ్బులందు
బుద్ధిపూర్వకముగా భుజియించుచున్నవా
రుగద రిఫ్రెష్మెంటు రూములందు
ఆనంద భరితులై యారగించుచు నుంటి
రిగద సోషల్ గేదరింగులందు

మేలి మాలిమితోడ మెసవుచుంటిరిగదా
చాల గార్డెన్ పార్టీలయందు

తే. స్నేహభావంబు వెలయ నుత్సాహ మొలయ
మెక్కుచున్నారుగాదొ పిక్ నిక్కులందు
సకలజాతులవారు సంశయము దక్కి
కులము లఘు వెందు బోవునో తెలుపరయ్యా! ౨౬

సీ. కలుగరే మాలో నఖండశౌర్యాఢ్యులై
రాజ్యంబులేలిన రాచవారు!
పుట్టరే మాలోన బుద్ధిసంపన్నులై
విద్యావిలాసంబు వెలయువారు!
లేరె మాలో యోగలీలా వినోదులై
ఘన తపోమహిమచేఁ గ్రాలువారు!
నెగడరే మాలోన నీతివిస్ఫీతులై
శీలశాలితఁ బ్రకాశించువారు!

తే. ఉదయ మొందరె మాలోఁ బరోపకార
మానితవ్రతమున ధన్యులైనవారు!
తక్కుఁగల వర్ణములకన్నఁ దక్కువనఁగ
లోపమేమైన మాయందుఁ జూపఁగలరె? ౨౭

సీ. ప్రాలు మాలక పాటు పడెడు వార మనంగ
విస్తరించిన సేద్యవృత్తి సాక్షి!
ఘన పరిశ్రమలందు గడిఁదేరితి మనంగ
మాలనూ లను మేలిమాట సాక్షి!
బహుళ విద్యామర్మ పారీణుల మనంగ
ననవద్య హృద్య వాద్యములు సాక్షి!
విశ్వాసబుద్ధిచే వెలయువార మనంగఁ
జిరసమాగత రాజసేవ సాక్షి!

తే. నీతిచే వన్నెకెక్కిన జాతియనఁగ
మాయమర్మంబు లెఱుఁగని మనసు సాక్షి!
తక్కఁగల వర్ణములకన్నఁ దక్కువనుచుఁ
దీసివేసిన పని యేమొ, తెలుపరయ్య! ౨౭

సీ. చెమటోడ్చి సేద్యంబు చేయువారము మేము
పంటలెల్ల భుజించువారు మీరు
పశువులనెల్లఁ గాపాడు వారము మేము
పాలు పెరుఁగుఁ ద్రాగువారు మీరు
పెద్దతోఁటలు వేసి పెంచువారము మేము
పండ్లారగించెడివారు మీరు
ముచ్చెజోడు లమర్చి తెచ్చువారము మేము
వానివల్ల సుఖించువారు మీరు
ఆ. ప్రతిదినంబుఁ గష్టపడెడువారము మేము
ఫలము లనుభవించువారు మీరు
వాడఁదలఁచినారె పనిముట్లవలె మమ్ము!
మనుజులనెడు మాట మఱచినారె! ౨౮

సీ. పాలేర్ల కియ్యంగ వలసి వచ్చిన కొల్చ
పిచ్చుకుంచాలతో నిచ్చువారు
పాలేర్లు తీర్చెడు బదులు కొల్చును గొల్వఁ
బెచ్చుకుంచము లెంచి తెచ్చువారు
బదులిచ్చినట్టి యేఁబది కుంచముల కొక్క
పదిఁజేర్చి పద్దులు వ్రాయువారు
అక్కఱకై కొంత యప్పిచ్చి తక్కువ
కూలి కెప్పుడు పనుల్ గొనెడువారు
తే. మాలలకు సరిహద్దులో మాన్యమున్న
గదుముకొని తమ పొలములోఁ గలుపువారు

నగుచు నేడ్పింతురే యిట్టు లక్కటకట!
రయితులార! దయారస రహితులార! ౩౦

సీ. పాలిచ్చినన్నాళ్ళు పాలించి యావుల
ముసలివంచును ద్రోసి పుచ్చినట్లు
స్వారికై యుపయోగపడు గుఱ్ఱములఁ బెంచి
పెద్దవానిని విడ్చిపెట్టినట్లు
దుక్కి కక్కఱకైన దున్నలఁ బోషించి
వృద్ధత్వదశయందు విడిచినట్లు
బరువు మోసిననాళ్లు బ్రతికించి యేన్గుల
వగ్గుతనంబున వదలినట్లు
తే. పడుచుఁదనమున మా వల్లఁ బనులు గొనుచు
నకట! మాయౌవనంబెల్ల నపహరించి
బల ముడిగినంతనే మమ్ముఁ దలఁప రహహ!
రయితులార! దయారస రహితులార! ౩౧

సీ. చనుమానముచఁ జేరి చనుఁబాలు తెగఁద్రాగి
క్రుద్ధత్వమున తొమ్మ గ్రుద్దినట్లు
కొల్లఁగా నున్నపాలెల్లఁ బిండుక గ్రోలి
కోపించి పొదుగును గోసినట్లు
ఫలములెల్లను దుల్చి యొలమిమై భక్షించి
క్రూరత్వమునఁ జెట్టుఁ గూల్చినట్లు
అక్కఱయైయుండఁ దాఁక నందాఁక నిల్చి య
క్కఱఁదీర సత్రంబుఁ గాల్చినట్లు
తే. కావలసినన్ని పనులెల్ల మావలననె
యిచ్చకంబులు పలికి చేయించుకొనుచుఁ
గడకు మే మెందుకును కొఱఁగామటంచు
గాసియిడుట కృతఘ్నత గాదటయ్య! ౩౨

సీ. ఒజ్జయే శిష్యు మే లోర్వఁ జాలనియట్లు
కంచెయే చేన్మేయఁ గడఁగినట్లు
హారమే సర్పమై ప్రాణముల్ గొనినట్లు
గొల్లఁడే గొఱ్ఱెలఁ గోసినట్లు
తల్లియే పిల్లపై దయను దప్పినయట్లు
శరదమే నిప్పులు గురిసినట్లు
ఇష్టదైవమె యష్టకష్టంబు లిడినట్లు
మిత్రుఁడే మిత్తియై మ్రింగినట్లు
గీ. తల్లిదండ్రు లన్నదమ్ములును దాతలు
దైవ మీరెయనుచుఁ దలఁచి నమ్మి
భయము భక్తి గలిగి పగలు రేలును మీకు
సేవచేయు మమ్ముఁ జెఱుపఁ దగునె? 33

సీ. జీవహింసయె నిత్యజీవనంబుగ నున్న
కటికివారలనైన గౌరవింత్రు
పడుపుఁదనంబె యెప్పుడు వృత్తిగాఁ గల్గు
గడనకత్తెల నైన గౌరవింత్రు
లంచపుగడ్డి కొల్లఁగ మేయు దుష్టాధి
కారి పశులనైన గౌరవింత్రు
కల్లలే కూడుగాఁ గలిగివర్తించెడు
గడుసు గొడ్డులనైన గౌరవింత్రు
ఆ. మంచివృత్తి గలిగి మానంబు విడువక
నీతి గలిగి సత్య నిరతి గలిగి
వెలయు మమ్ము నిట్లు వెలివేసి చుల్కనఁ
జేసి గాసివెట్టఁ జెల్లునయ్య! 34

సీ. మేనెల్లఁ గడు నల్లనైనంత మాత్రాన
మనుజస్వభావంబు మాఱునొక్కొ?

మలినవేషముఁ దాల్చి మసలుచుండిన మాత్ర
స్వేచ్ఛాభిరతియే నశించునొక్కొ?
దారిద్ర్య దుఃఖార్త దశనున్న మాత్రాన
నాశాంకురములెల్ల నణఁగు నొక్కొ?
కొనలేని దైన్యంబు ననుభవించెడు మాత్రఁ
బౌరుషశక్తి చల్లారు నొక్కొ?
తే. జ్ఞాననేత్రంబు లేనిమాత్రాన సౌఖ్య
జీవనాపేక్ష చిత్తానఁ జేరదొక్కొ?
అకట! మా స్వామ్యములనెల్ల నపహరించి
హింసఁబెట్టెద రెట్లు సహింతుమయ్య! ౩౫

సీ. ఏపుట్టగనుగొన్న నాపుట్టనాగేంద్రు
నిరవుగా భావించు సరసులార!
ఏచెట్టుగనుగొన్న నాచెట్టు భగవంతు
నెలవుగా నెంచు ధీలలితులార
ఏగట్టుగనుగొన్న నాగట్టు పరమేశు
నిల్లుగాఁదలఁచు సుధీంద్రులార!
ఏమిట్టగనుగొన్న నామిట్ట జగదీశు
నవతారముగ జూచు ననఘులార!
గీ. మృగముల ఖగంబులను సరీసృపములందు
చెట్టులను పుట్టలందును మిట్టలందు
నీశ్వరుని లీలలను గాంచి యెసగుమీరు
నరుల హింసింతు రిదియేమి న్యాయమయ్య? ౩౬

సీ. కోఁతిని గనుగొన్న ప్రీతితో హనుమంతు
నంశగాఁదలఁచు పుణ్యాత్ములార,
వృషభంబుగని వెంకటేశ్వరుండనుచు నం
దీశ్వరుండని మొక్కు నీడ్యులార,

కుక్క భైరవుఁడంచు గురుతర భక్తితో
భావించు కారుణ్య భావులార,
శ్రద్ధను గనుగొన్న గరిమతో విఘ్నవా
హనముగా నెంచు ధర్మాత్ములార,
గీ. ఎలుక జూచి పాము దలకించి
విఘ్నేశు వాహనంబు విష్ణుపాను పనుచు
బాధచేయ లేని సాధుశీలురు మీరు
సాటినరుల మీఁద చలము తగునె! 3౬

సీ. చలిచీమ లెక్కడఁ జచ్చిపోవునో యంచు
నడుగులు మెల్లఁగా నిడెడువారు
తీఁగెనుండిన పూవుఁ దెంపఁ జేయాడక
కనులారఁ గని తృప్తిఁగనెడువారు
మిగుల ముగ్గియు నేలమీఁద రాలక చెట్ల
నున్న పండ్లను గోయ నోడువారు
మోయఁజాలక నొచ్చునో యన్న భయమున
వాహనా లెక్కక వదలువారు
తే. దుష్టజంతులనైన శత్రువులనైనఁ
బట్టి వధియింపఁగాఁ గొంకువడెడువారు
సాధుహిందువు లట్టినైజమును విడిచి
తోడినరులను హింసింపఁ గూడునయ్యా! 3౭

సీ. వర్ణముల్ మను వెన్ని వ్రాసెనో యొకమారు
ధర్మశాస్త్రంబును దడవరయ్యా!
మన పురాణంబు లేమనుచు బోధించునో
శ్రమయెంచ కొకసారి చదువరయ్యా!
గీతలోఁ గృష్ణుఁ డేరీతిగాఁ జెప్పెనో
వేఁడెద నొకమాటు చూడరయ్యా!

పూర్వచారిత్రల పోకడలెట్టివో
విసువక యొకతూరి వెదకరయ్య!

తే. ఎట్టు లీపంచమకులంబు పుట్టినదియొ
తప్పక యోచించినది యొల్లఁ జెప్పరయ్య!
మీవలన నేర్పడిన జాతి మీరె రోసి
పాఱఁ దోలిన నది యెట్లు బ్రతుకునయ్య! ౩౯

సీ. మాకు వైష్ణవమిచ్చి మమ్ముద్ధరింపఁడే
మాననీయుండు రామానుజుండు
మతధర్మములు దెల్పి మ మ్మోద్ధరింపఁడే
శ్రీదయానందుండు చిరయశుండు
తన మతంబునఁ జేర్చుకొని గౌరవింపఁడే
వానకు శుద్ధ విజ్ఞానమూర్తి
స్వమతంబు విడకుండ సమత మన్నింపఁడే
యల వివేకానందుఁ డలఘు గుణుఁడు

తే. ధన్యులను జేయలేద చైతన్యులాది
యైన మతకర్త లేక నాథాద భక్తు
లకట! మీరిట్లు విడనాడి యుదయులగుచుఁ
జిన్నఁబుచ్చెద రిది యేమి శీలమయ్య? ౪౦

సీ. కవికోకిలము తొల్త్రి కవివేకి వాల్మీకి
యేవర్ణమున నుదయించినాఁడు?
మౌనిమండల పితామహుఁడౌ పరాశరుం
డేకులంబున జన్మమెత్తినాఁడు?
ధర్మసంవేది వేదవ్యాస మునిచంద్రుఁ
డేవంశమందు జన్మించినాఁడు?
ధన్యుఁ డధ్యాత్మ విత్తముఁడు మాన్యుఁడు శుకుం
డేగోత్రమున నుద్భవించినాఁడు?

తే. సత్యవతి జనియించిన జాతియేది?
రోహిదాసుండు పుట్టిన గేహమేది?
వారలెల్లరుఁ బూజ్యులై వరలలేదె?
కులములేదని మహిమంబు కొలఁదివడెనె? ౮౧

సీ. అభిమాన పుత్రికలని మాకులస్త్రీల
గాధిరాజ సుతుండె గారవించె
తన సభాస్థానమందునఁ బ్రవేశం బిచ్చి
యా హరిశ్చంద్రుఁడే యాదరించె
ఘనుఁడు మారోపంతుఁ డను మహాభక్తుఁడే
మాజాతి కల్లుఁడై మైత్రిఁగూర్చె
పుడమివేల్పుకంటె ముందు విందొనరించి
యల యేకనాథుఁడే యశముఁదెచ్చె
తే. వారు మావంటి మాలలు గారఁటయ్యా!
వారు మీవంటి సత్కులుల్ గారఁటయ్యా!
మమ్ము వెలివేసి త్రోయ ధర్మమ్మఁటయ్యా!
చిన్నఁబుచ్చక మముఁ జెంతఁ జేర్పరయ్యా! ౮౨

సీ. అలఘు శాపానుగ్రహసమర్థుఁడగు మతం
గమహర్షి మావంశకర్త గాఁడె!
ఘనతర జ్ఞానియౌ కపిల మౌనీంద్రుండు
మాకొలమ్మునకుఁ గన్నాకు గాఁడె!
నందవరమ్ము నందముగ నేలిన వీర
నందుండు మాకు నందనుఁడు గాఁడె!
వైష్ణవార్చనము లవ్వారిగాఁ గొను తిరు
ప్పాణియాళ్వారు మావాఁడుగారె!
తే. కవికుల విభూషణంబన్న ఖ్యాతిఁ గన్న
కనక విబుధుండు మాకులాగ్రణియె కాఁడె!

మందులముఁ బందలముఁ గాము మంచివిద్య
నేర్పి యున్నత పదవుల నిలుపరయ్య! ౪౩

సీ. పల్నాటిసీమలోఁ బ్రబలయోధుండైన
కన్నమనీఁడు మాయన్న గాఁడె?
శ్రీహర్షు నాస్థానసీమ సత్కవి దివా
కరుఁడు మాకూర్మి సోదరుఁడుగాఁడె?
యామునార్యుల శిష్యుఁడై యొప్పు మారనా
ర్నంబి మాకుల భూషణంబుగాఁడె?
భక్తరత్నంబుగా భాసిల్లు నల చోక
మేళుండు మా భ్రాతృమాళిగాఁడె?
తే. రాసుత కురంగి కోడలై వాసిఁగనదె?
యల త్రిశంకుండు చుట్టమై యలరలేడె?
పూజనీయుల కెల్లను భాజనంబు
మాజనం బిది తెలియదే భూజనంబు? ౪౪

సీ. జగదేకపూజ్యురాలగు నరుంధతి సాధ్వి
భావింప మా యాఁడపడుచు గాదె!
ఇనకులోత్తమ పురోహితుఁడు సన్ముని వసి
ష్ఠుండు మాయింటి యల్లుండు గాఁడె!
సత్యసంధుఁడు హరిశ్చంద్రుఁ డాదిమసార్వ
భౌముండు మా పెద్దబంటు గాఁడె!
దొడ్డ మహారాజుబిడ్డ మాయావతి
మాయింటి కోడలై మలయలేదె!
గీ. పాండురాజ కుటుంబిని పరమపూజ్య
వృత్త గొంతెమ్మ మా కిలువేల్పు గాదె!
ఎన్నొ సంబంధములు మన కున్న విట్టు
లన్యులము కాము సుమ్మండి! ఆర్యులార! ౪౫

సీ. బ్రాహ్మణుండు, గురుండు, బ్రహ్మర్షి వరుఁడు నై
తనరు నులోపి మాతాతగాఁడె?
వరగుణోత్తరుఁ డా యవంతివర్ధనుఁడు రా
కొమరుండు మా పెండ్లికొడుకు గాఁడె!
అల భృగుబ్రహ్మ వంశావతంసంబైన
పరశురాముండు మా భ్రాతగాఁడె?
తపసిరాయలలోన విపుల కీర్తినిఁగన్న
జమదగ్ని మాపితృ సముఁడుగాఁడె?
* తే రేణుకాదేవి మాకు మాతృమణి గాదె?
వామదేవుండు బంధురత్నంబు గాదె?
ఎంద ఱందఱు మావంశమందుఁ బుట్టి
పూతచరితులు గాలేదు పూర్వమందు? ౮౬

సీ. శ్రీమత్పెరుంబుదూర్ రామానుజస్వామి
తేరు లాగుదురు మావారు గాదె!
సంక్రాంతి మూఁడు వాసరములు మేల్కోట
స్వామి సేవింత్రు మావారు గాదె!
హైందవప్రజ లంద ఱారాధనలు సేయు
మాతంగకన్య మా నాతిగాదె!
ఆదిశంకరులకు నధ్యాత్మవిద్యఁ బ్ర
సాదించె మాజాతి జనుఁడుగాదె!
గీ. పంఢరీపురమున విష్ణుభక్తు లెల్ల
రహినిఁ బూజించు దేవులు మహరులనెడు
మహిమగల విగ్రహంబులు మావి గావె!
అగ్రజలము కామె! సత్కృతి కార్యులార! ౮౭

* మంత్రరత్నాకరము, క్రీడాభిరామము.

సీ. పంచదారలుఁ బాలుఁ బండ్లు నెట్టుచు ముద్దు
చిలుక లాలించు రాచిలుక మీఁద
రమణీయగతి గూఁడు లమరించి గారాము
గులుకఁ బెంచెడు లేడి గువ్వ మీఁద
పీఁడి పంజరములోపలఁ బెట్టి చెలికార
మొలికించు నెమలి లేమొలక మీఁద
తులకించు మచ్చికల్ తొలికించి పలికించి
కులికించు గోర్వంక పిలుక మీఁద
తే. కలికి పలుకారి పావురా పులుఁగుమీఁద
మురిపెములు గొల్పు కోయిల బోఁదమీఁద
చిలుకరించు దయారస శీకరములు
చలము విడనాడి మామీఁదఁ జల్లరయ్య! ౪౮

సీ. అడుగలేదుగదయ్య కడిమిమై మీతోడి
స్నేహప్రధానోపగూహనములు
కోరలేదుకదయ్య కూర్మిమై మీతోడి
సంబంధ బాంధ వాడంబరములు
వేఁడలేదు గదయ్య వేడ్కమై భోజన
ప్రతిభోజనాది సంభావనములు
ప్రార్థింపలేదయ్య బల్మిమై నన్యోన్య
గేహప్రవేశ కోత్సాహవిధులు
తే. పరమతంబులఁ గలసిన పంచములకు
మావలెనె నీచకులులైన మానవులకు
నెట్టి గౌరవమిచ్చి ప్రేమించుచుందు
రట్లు ప్రేమింపరయ్య! మమ్మార్యులార! ౪౯

సీ. పల్లెకూటములకు బాహాటముగవచ్చి
చదువుకోనిచ్చినఁ జాలు మాకు!

అన్ని వీథులయందు నడ్డంబు లేకుండఁ
జరియింపనిచ్చినఁ జాలుమాకు !
నీళ్ళరేవులలోన నిస్సంశయంబుగా
జలము చేకొననిండు చాలుమాకు !
తోడి నీచకులాలతోఁ బాలుగా మమ్ము
సభలకు రానిండు, చాలుమాకు!

తే. గౌరవముఁ గోరి యిస్లాము క్రైస్తవాది
పరమతంబులఁ జేరిన పంచమాది
నరుల మన్నించునట్లు మమ్మరయుచున్నఁ
జాలు! నయ్యదియే పదివేలుమాకు! ౫౦

సీ. శరణాలయంబులు కరుణాలవాలులై
నెలకొల్పి దీనుల నిలుపరయ్య!
పాఠశాలలు కృపాపరులై ప్రతిష్ఠించి
దివ్యవిద్యాశక్తిఁ దెలుపరయ్య!
వైద్యశాలలు దయావంతులై స్థాపించి
యాపన్నులకు దారిఁ జూపరయ్య!
కర్మాలయము లనుగ్రహముతో నిర్మించి
నిఖిల వృత్తులు మాకు నేర్పరయ్య!

తే. స్వమత ధర్మంబులను ధర్మశాలు లగుచు
మాకు వివరింపఁగదరయ్య! మాస్వధర్మ
సరణి ననుకంప పెంపార సరిగ నేర్ప
రించి, బోధించి, మ మ్ముద్ధరింపరయ్య! ౫౧

సీ. పంచముల్ చదువులోపలఁ బ్రవేశించినఁ
బాలేర్లు దొరకు టబద్ధమనుచు
శ్వపచులు శుచిగల్గ సంచరించెదరేని
పాకివృత్తికిఁ గల్గు భంగమనుచు

గోసంగు లెల్లరు గొప్పవారైనచోఁ
జర్మకారకవృత్తి జరుగదనుచు
మాదిగల్ ధనికులై మన్నింపఁబడుచున్న
వెట్టి చాకిరిమాట వట్టిదనుచు
తే. స్వార్థపరు లాడుదానికి జడియువలదు!
వృత్తులు నశించు ననుమాట ఉత్తమాట!
గొప్పకొలఁదులవా రుందు రెప్పటికిని
నాగరక సీమలె నిదర్శనములు మనకు. ౫౨

సీ. బాల్యవివాహముల్ బహ్వనర్థములకు
హేతువులగుట మీ రెఱుఁగరొక్కొ?
విధవావివాహముల్ విహిత కృత్యములంచు
నాత్మసాక్షిగ మీర లరయరొక్కొ?
నావికాయానం బనంతలాభప్రదం
బేయంచు మీర లూహింపరొక్కొ?
జాతిభేదములు దేశమును వర్ధిలనీక
నిలువరించు నటంచుఁ దెలియరొక్కొ?
తే. చేయుచున్నారు; చేయరు; చేయరారు;
తీసివేయరు; కటకటా! తెలిసితెలిసి;
అంతరాత్మకు వ్యతిరేక మాచరింత్రు;
దళిత ధృతులార! ఆచారదాసులార! ౫౩

సీ. ఆత్మరక్షణపరాయణు లుద్భవించిన
భరతవర్షమ యిది! భక్తవరద!
శరణాగతత్రాణ బిరుదాంకులను గన్న
హిందుదేశమ యిది! హృదయనాథ!
కరుణాసుధారస వరుణాలయములు మన్న
యార్య భూమియె యిది! యాదిదేవ!